హనుమద్గ్రంథ మాల　　　　　చతుర్థ సూనము

శ్రీమేధా దక్షిణామూర్తయే నమః

నీతి కథానిధి

ఇది

పెరవలి గ్రామమందలి బోర్డు హైస్కూలునందు

ఆంధ్రోపాధ్యాయులుగా నుండిన

అష్టావధాని, కవిశేఖర

అబ్బరాజు

హనుమంతరాయశర్మ పాకయాజిచేత

రచియింపఁబడి

చవ్వాకుల వేంకటకృష్ణయ్యగారి

ద్రవ్య సహాయమున

తెనాలి రజత ముద్రాక్షరశాల యందు

ముద్రింపఁబడి, ప్రకటింపఁబడియె

NEETHIKATHANIDHI

Author
ASTAVADHANI, KAVI SEKHARA
ABBARAZU HANUMANTHARAYA SARMA PAKAYAJI
Telugu Pundit B.H.School, Peravali

First Edition : 1000
Second Edition : 1000

1926

[Price Rs. **5**

నీతి కథానిధి

అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజి

తొలి ప్రచురణ : 1926
ద్వితీయ ప్రచురణ : డిసెంబర్ 2017

ప్రతులు : 1000

వెల : అమూల్యం

ప్రచురణ & ప్రతులకు :
వెలది సత్యనారాయణ
ప్లాట్ నెం. 170, 2వ వీధి,
యశ్వంత్ నగర్, మాడంబాక్కం,
చెన్నై - 600 126. త.నా.
ఫోన్ : 09840228102

డి.టి.పి. :
సుప్రియ గ్రాఫిక్స్
నెం. 5, ట్రస్ట్‌పురం సెకండ్ మెయిన్ రోడ్డు,
కోడంబాక్కం, చెన్నై - 600 024.
ఫోన్ : 9841458869

ప్రింటింగ్ :
గోటేటి గ్రాఫిక్స్
తంబయ్యరెడ్డి రోడ్డు, వెస్ట్ మాంబళం,
చెన్నై - 33.
ఫోన్ : 24742091

"నీతి కథానిధి" పునఃపరిచయం

ఈ 'నీతి కథానిధి' గ్రంథకర్త, అష్టావధాని, కవిశేఖర బిరుదాంకితులు, సంస్కృతాంధ్ర భాషా కవి, పండితులు, శ్రీ మద్హనుమద్గీతాది బహుగ్రంథకర్త యగు బ్రహ్మశ్రీ అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజి గారు నాకు స్వయాన మాతామహులు.

తాత పాకయాజి, సుబ్బమ్మ గార్ల ప్రథమ సంతానం, జ్యేష్ఠ పుత్రిక సీతారామాంబ (భర్త శ్రీ వెలది తిరుమలరావు) గారి ఐదుగురు సంతానం (1. వకుళాదేవి (వేంకట లక్ష్మీపార్వతి), 2. వేంకట కోదండపాణి, జగన్నాథరావు, సత్యనారాయణ, సుశీలాదేవి)లో తృతీయ పుత్రుడను నేను.

చెన్నై శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం బాలుర మహోన్నత పాఠశాలలో స్పెషల్ గ్రేడు సెకెండరీ గ్రేడు ఉపాధ్యాయునిగా పనిచేసి, విశ్రాంత ఉపాధ్యాయునిగా ఇక్కడనే గత 45 సంవత్సరములుగా స్థిర నివాసమేర్పరచుకొని యున్నాను.

మా మాతామహులు (1946 అనుకుంటా) పరమపదించు నాటికి నా వయస్సు ఆరు సంవత్సరాలు. ఆ తరువాత కాలంలో మా తాతగారి గురించి, నాకు మా అమ్మగారు చెప్పగా విని నేను మిక్కిలి ఆనందించాను. అంత గొప్ప పండితునకు మనుమడు (దౌహిత్రుడు)గా జన్మించినందులకు గర్వపడినాను. అది నా పూర్వజన్మ సుకృతంగా భావించితిని.

మా తాతగారు శ్రీ అబ్బరాజు హనుమంతరాయ శర్మ పాకయాజి గారిచే రచించబడి, ముద్రితములైన బహుళ గ్రంథములలో ఒకటియైన, యీ 'నీతి కథానిధి' ఒకటి. ఈ గ్రంథమును పునర్ముద్రణ (ద్వితీయ ముద్రణ)ము గావించుట ద్వారా, నాకు వారియందుగల విశేష భక్తిప్రపత్తులను, ప్రేమాభిమానములను, దౌహిత్రుడనైనందులకు వారిపట్ల నాకు గల కృతజ్ఞతను తెలుపుకొనుచున్నాను.

చెన్నై-126 **వెలది సత్యనారాయణ**
డిసెంబర్ 2017 ప్రచురణకర్త

తొలిపలుకు

నీతి కథానిధియను నీ పుస్తకము క్రింది తరగతుల విద్యార్థులకుఁదగునట్లు కడు సులభశైలితో వ్రాయఁబడినది. గ్రంథకర్త యీ విషయమును వ్రాసియేయున్నాఁడు. ఇందు రావు బహదూర్ కందుకూరి విరేశలింగము పంతులుగారు బాలుర నిమిత్తము వ్రాసిన ద్విపదలను తదితర విరచితములగు పద్యములను నాధారము చేసికొని తత్తదనుకూలములగు ప్రసిద్ధ నీతికథలను బొందిక చేసి వ్రాసిన గ్రంథకర్త ప్రయత్నము పూర్వస్థిత నీతులకు వన్నె దెచ్చినదియై గణనీయమై యున్నది. ఎల్లవిధములచేతను బాలుర జ్ఞానాభివృద్ధి హేతువగు నీ చిన్ని పొత్తమును నుపాధ్యాయులు తమ విద్యార్థులకు బోధించుట యవశ్యకర్తవ్యము.

ఇట్లు,

ములుకుట్ల వేంకటకృష్ణశాస్త్రి, శతావధాని,

తాలూకా హైస్కూలు నందలి ప్రధానాంధ్రోపాధ్యాయుఁడు

తెనాలి.

శ్రీవృషనామ సంవత్స రాశ్వీజ శుIIబుధవాస రానూరాధా నక్షత్రమున జననము.



ప్రస్తుత నివాసము పెరవలి

అబ్బరాజు హనుమంతరాయశర్మ పాకయాజీ, కృతికర్త

కృతిహితులు

కం. శ్రీయును, విద్యయు శీలముఁ
బాయకలరు "పైడిపాటి ♦ వంశాబ్ధివిధున్"
గేయగుణుని 'యతిరాజుల
నాయుని" గృతిహితుని నెమ్మ♦నంబున నెంతున్.

ఆ. జంటసిరులపంట ♦ గుంటూరు మండల
వరసభాసరః ప్ర ♦ పర్తమాన
సభిక ముఖసరోజ ♦ సారస మిత్రుని
కార్యధుర్యు నెంతు ♦ ఘనకృతిహితు.

ఆ. సార చెన్న రాష్ట్ర ♦ శాసననిర్మాణ
సమితి కార్యకోటి ♦ సాధనచణ
మానసాంబుజాతు; ♦ మానితగుణజాతు
గృతిహితుందలంతు ♦ గృతిముఖమున

తే. మాతృభక్తియు, ♦ బితృభక్తి మాన్యవిప్ర
భక్తియును, గురుభక్తియు, ♦ భగవదంఘ్రి
పద్మభక్తియు, నృపభక్తి ♦ బాయకుండు
కృతి హితుఁదలంతు నిరతంబు ♦ గృతిముఖమున

తే. పాఠశాలల దేశిక ♦ పాళిఁబాళి
నరసివృద్ధికి దే ♦ దగి నట్టి సభకు
ప్రభువుయినయట్టి "మా పైడిపాటి వంశ
వార్ధి చంద్రుని" గృతిహితు ♦ నర్థినెంతు.

శ్రీ చెవ్వాకులవారి వంశావళి

కృతజ్ఞత

ఉ॥ శ్రీకుల శీల సంపదల ♦ చేతను, భూతన యాత్మనాయకా
వ్యాకుల భక్తిచేత, క్షితి ♦ పాలక జాలక గౌరవాప్తి చే
నాకుల పూజచేఁదెలుగు ♦ నాయక లోకమునందు నెందుఁజె
వ్వాకులవారివంశ,మని ♦ వార్యముగాఁ గొనియాడఁగాఁదగెన్.

క॥ ఆయలరారఁగల తెలుఁగు
రాయలఁ జెవ్వాకుల కుల ♦ రమ్యాబ్ధికి రే
రాయలయు వెలుఁగఁగా దగు
రాయలనఁగ నొక్క తెలుఁగు ♦ రాయండొప్పున్

క॥ శ్రీరమణా దృతశీలుం
డారాయలు నాత్మపత్ని ♦ యందల రారం
బేరయ్య యనెడు కొమరు, ను
దార గుణాన్వితుని రిపువి ♦ దారుం గనియెన్

సీ॥ పేరయ్య తనదైన పేరయ్యవని నిల్ప
వేరెవ్వ రితఁడునా ♦ వేంకటేశ
మీమహీస్థలినర్థి బ్రేమమైఁ దస్సఁగా
నామారిత దునా ♦ సోమయాఖ్యు

నసమాన పశుపాల ♦ క సుధీ విశాలత
నెసఁగ నాజంటనా ♦ ముసలయాఖ్యు
నబ్బురంబగు కీర్తి ♦ నిబ్బరంబుగ నిల్ప
నబ్బెనా కెనగనా ♦ సుబ్బయాఖ్యు

తే॥ నాత్మసదృశుల నల్వుర ♦ నాత్మజులను
బడసెఁదనకీర్తి సంపద ♦ పుడమినడర
బుధులు వొగడనా నల్వురు ♦ పుత్రులందు
వేంకటేశమ్ము హరిభక్తి ♦ వెలసియుండె.

క॥ ఆ వేంకటేశ మర్మిల
చే, వేర్పడ కధిక భద్ర చిహ్నాంచితమై
శ్రీవెలసినట్టి యచ్చమ
చేవెలయుఁగబట్టె బంధు శీలము వొలయన్.

సీ॥ గాఁటంపు నాజంట ♦ కూఁటమి తొలిపంట
కోటయాఖ్యుఁడు, వేడు ♦ కొన్నవాండ్ర
యొద్దడి బాపంగ ♦ బెద్దగాఁగాపాడ
బెద్దరెడ్డెయ్యయుఁ ♦ బెద్దవాండ్ర
మిన్నగాఁగాంచుచుఁ ♦ జెన్నైన నడకను
జిన్న రెడ్డెయ్యయు ♦ జిన్నవాండ్ర
గన్నవారలకన్న ♦ దిన్నగాఁ గాంచు, రా
మ స్వామి యన్నల ♦ మాద్రివాండ్ర

తే॥ శుద్ధమతినెంచి మించెడు ♦ సుబ్బయాఖ్యుఁ
డమరఁగల్గిరి వేంకటే ♦ శమున, కందు

బెద్ద రెడ్డెయ్య వీరమ్మ ♦ బెండ్లియాడెఁ
జిన్న రెడ్డెయ్య కోటమ్మ ♦ చేయిపట్టె.

తే॥ పెద్ద రెడ్డెయ్య పండింపఁ ♦ బేర్మితోఁడ
వీరమాంబిక పండింప ♦ వేడ్కతోఁడ
జిన్న రెడ్డెయ్య తెప్పింప ♦ వన్నెగూడఁ
గోటమాంబిక యిప్పింపఁ ♦ గోర్కితోఁడ
లేచు విస్తళ్ళు బట్టలు ♦ లేక్కలేదు.

తే॥ శుభగుణాఢ్య మహాలక్ష్మి ♦ సుబ్బయయును
వేడ్కఁబాణి గ్రహణముగా ♦ వించుకొనిరి
నన్నల గుణాల నాయయ్య ♦ వన్నెగాంచె
నక్క సెల్లెండ్ర పొల్కి ♦ నాయమ్మ నడిచె.

ఉ॥ పెంచిరి వారలైదుగురు ♦ పేర్మిని జెఱ్వును దీయుకోర్కి ద్ర
వ్వించిరి దానినన్నిఁటికి ♦ వీలుగ, మేలుగ స్తంభ మొందు నా
టించిరి, జీవతృప్తిగ ♦ ఘటించిరి భోజన సత్రమాతతిన్
మించిరి కీర్తిచేత నతి ♦ మేదుర మోదర సానుభూతిచేన్

తే॥ అందు సుబ్బయ్య మహలక్ష్మమాంబయందు
బ్రేమ మీర వీరాస్వామి బృధుగుణమణి
నిలయు వేంకటకృష్ణు మాణిక్యమందు
సూర్యనారాయణుం గృష్ణు సొరిదిగనియె.

తే॥ అందు వేంకటకృష్ణయ్య యాత్మజనకుఁ
డన్నయందలి భక్తిచే నతఁ దపుత్ర

కుండుగాకుండ నీయంగ గోటమకును
జిన్నరెడ్డెయ్యకుఁ గుమారుఁడెన్ననయ్యె.

ఉ. భాషను గూర్ప నెయ్యెడల భాషను గూర్చి ధనంబునీయగా
భాషను నేర్చువారలకు భాషను బట్టి సహాయమీయఁగా
భాషను జ్ఞానముంగనగ భాషను దోషపుమాట దీటఁగా
భాషను వృద్ధిజేయు బుధవర్యుఁడు వేంకటకృష్ణయేతగున్ .

క॥ శ్రీలలరారంగఁ దెనాల్
తాలూకా బోర్డునందు దగు సభికుండై
మేలుగవై ప్రెసిడెంటై
చాలఁగనాళ్ళాఘనుండు సన్నుతి గాంచెన్ .

తే॥ మఱియు గుంటూరునందుండు మండల సభ
నీటినింగూర్చి చర్చించు మేటి సభను
సభికుఁడుగఁనుండి తత్కార్యచణుఁడు నగుచు
వినుతి వేంకటకృష్ణయ్య కనుచుండె.

ఆ॥ ఆప్తులు వారీకృతివిని వ్యాప్తింజెందుటకు ధనసహాయంబెంతే
గుప్తముగఁ జల్పిరుపకారాప్తిని నేన్నువాఁడ నాయనఘమతిన్

క॥ పంకనాభుని భక్తుఁడు
వేంకటకృష్ణయ్యఁ గీర్తి వెలయఁగనాయే
ణాంకరవి తారకముగ ని
రంకుశముగ వేంకటేశుఁడలరంగనుతన్ .

నీతి కథానిధి

ప్రథమ భాగము

3వ తరగతి

1. మంచిగుణము, చెడుగుణము

పూర్వము కశ్యపుఁడనువానికి ఇంద్రుఁడు హిరణ్య కశిపుఁడు అను ఇద్దరుకొడుకులుండిరి. వారిలో ఇంద్రుడు పెద్దల యెడ భక్తిగలవాఁడు. బీదసాదుల నేలువాఁడు. ఒకరి కలిమికి సంతోషపడువాడు ఒకరికి మేలుసేయువాఁడునై యుండెను. హిరణ్యకశిపుఁడు పెద్దల దూరువాఁడు పిన్నపాపల బాధించువాఁడు ఒకరిసొత్తును కోరువాడు ఒకరికి కీడు సేయ జూచువాఁడునై యుండెను. కావున వారిని జూచువారు ఇంద్రుడు దేవతలలోవాఁడు కావున వానికి మంచి గుణములు కలిగినవనియు, హిరణ్యకశిపుఁడు రాక్షసులలోవాఁడు కావున వానికి చెడ్డ గుణములు కలిగినవనియు మంచి వాని గుణములు చెడ్డవానికి ఎన్నటికి రానేరవనియు అనుకొనిరి.

ద్వి॥ ఉత్తముని గుణములున్నె నీచునకు
నెత్తిచ్చి కరఁగిన నిత్తడి పసిడె

తా॥ బంగారమువలె తూనికెవేసి కరఁగినంతనే దాని వన్నెయు విలువయు ఇత్తడి కెట్లు రావో? అట్లె మంచివాని గుణాలు చెడ్డవానికి రావు.

2. బ్రతికినన్నాళ్లు పాటుఁబడుము.

నందుడను గొల్లవానికి ఇద్దరు కొడుకులుండిరి. ఒకనాఁడు నందుఁడు ఆవులను మేతకై అడవికి దొలుకొని పోవుచుండగా పిల్లవాండ్రు తండ్రివెంటఁబడి పోరుబెట్టిరి. అప్పుడు తండ్రి వారిని చూచి బిడ్డలారా! నా వలె మీరును పనులు చేయుచుండవలెను. బ్రతికినన్నాళ్లు సోమరులము కాక పాటుపడినచో మనము బాగుపడఁగలము కాని మీరు చిన్నవారు పెద్ద పనులు చేయలేరు. నేటి నుండి యీ చిన్నదూడల ఊరి దగ్గిర పొలములో మేపుడని పలికెను. అప్పటి నుండి వారు తండ్రి వలె దూడలమేపుచు కొన్నాళ్లకు ఆవులనే కాయఁగల వారైరి.

ద్వి॥ ఊపిరిమేనిలో నున్న దినాల
నోపికితో బను లొనరింపవలయు

తా॥ బ్రతికినన్నాళ్లు పనులు చేయవలెను.

3. చదువుకొన్నవాడు అంతట పూజఁగానును

దేవుఁడు మంచివారిని రక్షించుటకు చెడ్డవారిని శిక్షించుటకు అప్పుడప్పుడు పుట్టుచుండును. అట్లె ఒకసారి దేవకీ వసుదేవులకు కృష్ణుఁడను పేరుతోఁ గలిగెను. అట్లు కలిగి తల్లి తండ్రుల కష్టములు తీర్చుటకు కంసుఁడు మొదలైన రాజులను చంపి తన మఱుఁగున జేరినవారిని కాపాడెను. కాని కృష్ణుఁడంతవరకు చదువుకొనలేదు. ఆ కారణమున ఆతనిపైకి వచ్చిన వారందఱు ఆయన శక్తినెఱుఁగజాలక చదువుకొననివాఁడవు నీవేమి ధర్మము లెరుగుదువని యుద్ధము చేయవచ్చితివి? అని తేలికగా మాట్లాడుచుండిరి. అదివిని కృష్ణుఁడు ఎంతటివానికైన విద్యలేక పూజ్యత గలుగదని సాందీపుఁడు అను అయ్యవారివద్దకు వెళ్ళి విద్యలన్ని నేర్చుకొని గొప్ప సభలలో బూజింపబడి కీర్తి కనియెను.

ద్వి॥ చదివినవాఁడుగా సర్వపూజ్యుండు
చదువక రాజైన సత్కీర్తి గనునె.

తా॥ చదివినవాడు పూజింపబడి కీర్తిపొందును. చదువనివాఁడు కీర్తిని పొందజాలడు.

4. ఉన్న చోఁటు వదలరాదు

ఒకప్పుడు సత్యవ్రతుఁడను రాజు భూమినేలుచుండెను. ఆయన ఒకనాడు ఏటిలో స్నానముఁజేసి సూర్యునకు నీరు వదలుచుండగా ఒక చిన్న చేపపిల్ల దోసిటిలోనికి వచ్చెను. అంతట రాజు దానిని నీటితోఁబాటు విసరి ఒడ్డున జల్లెను. అప్పుడది దిమ్మరపోయి తెప్పరిల్లి రాజవంకకు దిరిగి అయ్యో! నావంటి నీటి జంతువు నేలపై బ్రతుకునా; మా జాతీయములయిన జంతు వర్గములు నీరువదలి జీవింపఁజాలవు. నన్నా పెద్ద చేపలు తరుమగా నీ మరుగు జేరవలసివచ్చెను కాన చేరెడు నీళ్లలో వేసి ఉన్న చోఁటు వదలకుండ నన్నుఁగాపాడుమని వేడుకొనెను. ఆ మాటలు విని రాజు మఱొకతావున నీటిలో వేయించి దానిని గాపాడెను.

ద్వి. జములలోనున్న జంతువులెల్ల
నేలమీదద్రోచిన నెట్టులు బ్రతుకు.

తా॥ నీటి జంతువు నేలపై బ్రతుకజాలదు.

5. బీదలతో వాదులాడరాదు

హస్తినా పట్టణమున ఇద్దరు బ్రాహ్మణులుండిరి. వారు మంచి గుణములు గలవారు బాగుగా చదువుకొనినవారునై యుండిరి. మొదటివాఁడు పన్నిద్దరు బ్రాహ్మణులకు, రెండవవాఁడు ఎందఱు

బ్రాహ్మణులకైనను అన్నము పెట్టుదుమని నియత మేర్పరచుకొని, ఆ ప్రకారము వ్రతము జరుపుకొనుచుండిరి. కొన్నాళ్ళకుఁ దేవుఁడు వారిని పరీక్ష చేయవలయుననని ఒక నిరుపేద బాపని రూపముతో వచ్చి మొదటివానిని అన్నము పెట్టింపుమని అడిగెను. కాని వాఁడాసంగతి తెలియక నా నియతము చొప్పున పన్నిద్దరకుఁ బెట్టినాను నీకు మా యింట వీలుపడదని చెప్పెను. అట్లు కాదు, నాకు పిడిచెడన్నమో? గుప్పెడు బియ్యమో బిచ్చము పెట్టింపుమని వాఁడు కోరెను. వీలు కాదనిన నీకీ మొండితనమేల? పొమ్మని తఱిమెను. రెండవవాఁడది చూచి బీదలతో వాదమెందుకని అన్నము పెట్టెను. పిమ్మట దేఁవుడు తనను తృప్తిపరచినివానికి సంపదలు, తృప్తిపరచనివాని కాపదలు కూర్చెను.

ది॥ బీదకు బిచ్చంబు బెట్టఁగానెంచి
వాదంబులాడకు వానితోనీవు.

తా॥ బిచ్చమునకై బీదలతో వాదములాడరాదు.

6. చిన్న దీపము చీఁకటిఁ బాపును

ఒక అడవిలో జాంబవంతుడఁడను ఎలుఁగుబంటుల రాజుండెను. అతఁడు చాలా బలముగలవాడు. ఆయన యొకనాడు చుట్టు ప్రక్కల అడవిపట్టులలో మృగముల వేటాడుచుండెను. అప్పుడే ప్రసేనుఁడను ఒక రాజు వేటకు వచ్చెను. అట్లు వచ్చి

వాడొకపులిని చంపుదమని తుపాకి బారుపెట్టగా అదియే వానిపైబడి చంపి మెడలోని 'మణిని' యెత్తుకొని పోవుచుండెను. పిమ్మట జాంబవంతుఁడు దానిని చూచి ఆశ్చర్యపడి పులిని చంపి మణినిగొనిచని తానుండు కొండగుహలో కూతురగు జాంబవతి తొట్టెపై వ్రేలాడగట్టెను. ఆ గుహలో నది చిన్న దీపమువలె వెలుఁగుచు చీఁకటిని పోగొట్టుచుండెను.

దీ॥ పన్నిన చీఁకటిఁ బాపంగనొక్క
సన్నపు దీపంబు చాలదే తలఁప.

తా॥ వెలుతురు చీఁకటిని బోగొట్టును.

7. పిసినితనము కూడదు

కాశీపట్టణమున కాలకౌశికుఁడను బ్రాహ్మణుఁ డొకఁడుండెను. ఆయన కడుపునకు తినక పెండ్లమునకు బిడ్డలకైన పెట్టక ఎంతెంత కూడని పనులకైన వెళ్ళుచు వానివలన లెక్కలేని డబ్బును సంపాదించి వడ్డీలకిచ్చుచుండెను. అతఁడు డబ్బును గణించు ఉపాయములు, దేనికిగాని కర్చుపెట్టరాదను మాటలు భార్యకు బోధించెను. ఆమెయు బెనిమిటినే మంచివాడనిపించెనో యన "ఎంగిలి చేతఁ గాకి నదలింపక" డబ్బును గూర్చి దిబ్బెములో వేయుచుండెను. ఆ వెనుక కొన్నాళ్ళకు బ్రాహ్మణుఁడు ముసలివాడై తన బోధయే తనకు బాధకాఁగా పెండ్లము పిల్లలు తనను

చూడక అన్నము పెట్టక ఏడిపించగా "పాపము" కూటికి కూడా నవయవలసివచ్చెను.

దీ॥ బిడ్డలకిడకయుఁ బెండ్లానికీక
వడ్డికిచ్చుచుఁ జీమవలె గూఁర్పతగదు.

తా॥ తాను తినక ఒకరికిఁ బెట్టక డబ్బు గూర్పరాదు.

8. సత్యము సౌఖ్యమీయగలదు

దేవతలకు రాజగు ఇంద్రుడు సత్యము మరువక దాని వల్ల సుఖపడిన వాఁడెక్కడనైన ఉన్నచో చెప్పుడని కొలువువారి నడిగెను. అప్పుడు తాను లేచి అట్టివాడు హరిశ్చంద్రుఁడొకడున్నాడనిఁ వశిష్టుడు పలికెను. ఆ ఋషి మాట విని రాజుచే తా నబద్ధమాడింతునని విశ్వామిత్రుడు పలికెను. పిమ్మట విశ్వామిత్రుడు, రాజును మోసగించి రాజ్యము లాగుకొనెను. తరువాత అప్పు తీసికొనినాడని నెపము పెట్టి రాజు భార్యను బిడ్డను అమ్మించి రాజు నొక మాలవాని యొద్ద కొలువునకుఁ బెట్టెను. అప్పటికీ, రాజు సత్యము మఱువలేదు. తుదకు కాశిరాజు పిల్లవానిని జంపించి రాణిపై నేరము మోపి, రాజే ఆమెను చంపునంతచేసెను. కాని రాజంత కష్టము వచ్చిన సత్యము మఱువలేదు. అబద్ధమాడలేదు. ఆ వెనుక విశ్వామిత్రుడే ఓడితినని రాజునకు రాజ్యమిచ్చెను. రాజు అందువలననే అన్ని సుఖములు పొందెను.

ద్వి॥ మదిలోన సత్యంబు మఱువక యున్న
ముదమును సుఖమును బొందంగ వచ్చు.

తా॥ సత్యము మఱువనివాఁడు సౌఖ్యము నొందును.

9. శరణుజొచ్చినవానిని కాపాడవలయును

హస్తినాపట్టణమున ధృతరాష్ట్రుడు, పాండురాజు అను ఇద్దరన్నదమ్ములు కలరు. వారిలో పెద్దవానికి ధుర్యోధనుఁడు మొదలయిన నూరుగురు కొడుకులుండిరి. మఱియు నతనికి యుయుత్సుకుఁడను వేరొక కొడుకుండెను. చిన్నవానికి ధర్మరాజు మొదలయిన అయిదుగురు కొడుకులుండిరి. వీరును వారును రాజ్యము కొఱకు పోరవలసివచ్చెను. అప్పుడు ధర్మరాజునకు కృష్ణునిసాయ మున్నందున వారి వైపు తప్ప గెల్చునని ఒక వాడుక కలిగెను. అది విని దుర్యోధనునకు సోదరసమానుఁడయిన యుయుత్సుకుఁ ధర్మరాజు మఱుఁగు జొచ్చి తన్ను కాపాడుమని వేడుకొనెను. అంతట ధర్మరాజు వీఁడు శత్రువే యని తలంపక రక్షించి కీర్తి పొందెను.

ద్వి॥ శరణుజొచ్చిన నెట్టి శత్రువునైన
గరుణించి కావంగఁ గలుగదే కీర్తి.

తా॥ పగవాఁడయినను మఱుఁగుజొచ్చిన కాపాడవలెను.

10. సత్యము తప్పరాదు

తొల్లి హరిశ్చంద్రునివలెనే, పాండురాజు కుమారుఁడయిన ధర్మరాజును, సత్యము తప్పక నడచుచుండెడివాఁడు. అతని పెత్తండ్రి కొడుకయిన దుర్యోధనుడు మాయ జూదములో నతని నోడించి అడవుల పాలుచేసెను. అట్లడవులలో నున్నను అతడు సత్యము తప్పకుండనె ప్రవర్తింపు చుండెను. అతని తమ్ములు భార్య కష్టములు పడలేక దుర్యోధనునిపైకి యుద్ధమునకు బోయి వానిని గెల్చి రాజ్యము దీసికొని యేలుకొందుమని యెన్నోసారులు బోధించిరి. కాని అరణ్యవాసము, అజ్ఞాతవాసము అయినంతట వెళ్ళవలసినదే తప్ప మున్ను నేన్నమాట తప్పి అసత్యమున నడువనని ధర్మరాజనుచుండెను. అడవులలో ఉన్నను వారికి దుర్యోధనుడు కష్టములు కలిగించెను. ఐన ధర్మరాజతనికి కీడు సేయక మేలే చేసెను. అడవులలో ఉండడము ఎవరికి తెలియకుండ ఉండడడము గడువగానే సత్యమున దృష్టి నిల్పి ధర్మరాజు యుద్ధము చేసి దుర్యోధను గెలిచి తన రాజ్యము తా నేలుకొనెను.

ద్వి॥ సత్యంబు తప్పక చరియింపవలయు
నిత్యంబుఁగాగల్గు నీకు సంపదలు.

తా॥ నిజమున దిరుగువానికి సిరులబ్బును.

ద్వితీయ భాగము

1. దేవుఁడంతట ఉండును.

పూర్వము హిరణ్య కశిపుఁడను రాక్షస రాజుండెను. ఆయనకు ప్రహ్లాదుఁడను ఒక కొమారుఁడుగలడు. ఆ పిల్లవాడు చిన్నతనము నుండి దేవుని యెడల చాలాభక్తి గలిగియుండువాఁడు. వానికెప్పుడు దేవుని తలంచుట కొనియాడుటయే పనిగాని వేరు పనిలేదు. ఇట్లుండ వాని తండ్రి వానికీ ధోరణిపోయి తెలివివచ్చుటకు బడిలోఁజదువవేసెను. కాని వాని చూపుమాత్రమెప్పటట్ల దేవునియందే యుండెను. తరువాత కొన్నాళ్ళకు పిల్లవాని తెలివితేటలెట్లున్నవో కనుగొనుటుకై తండ్రి వానిని బిలిపించెను.

అప్పుడు పిల్లవాఁడు వచ్చి తండ్రికి మ్రొక్కి నిలుచుండెను. అంతట తండ్రి వానిని జేరదీసి నాయనా! నీకేమి తెలియును, నీవే విద్య నేర్చితివని వానినడిఁగెను. దేవుని గురించిన విద్య నాకు తెలియును. నేను నేర్చిన దదియే నని పిల్లవాడఁడనెను. పిమ్మట దేవుఁడెందుండుదనని తండ్రి అడిగెను. అంతటనున్నాడని పిల్లవాఁడు పలికెను. అట్లైన ఇప్పుడీ స్తంభమునఁ జూపఁ గలవా? అని తండ్రి యనెను. చూపఁగలను అంతటనుండు వాఁడు స్తంభమున నేల ఉండడని వాఁడనెను. అట్టు చూపలేకున్న నీ తల ద్రుంతునని తండ్రిపంతములాడెను. అప్పుడేక దీక్షతో పిల్లఁడు దేవుని వేడుచుండెను. అంతలో స్తంభము నుండి దేవుడు వెడలి వచ్చి రాజును శిక్షించి పిల్లవానిని రక్షించెను.

ద్వి॥ ఎందుఁజూచిన మఱి యే వేళనైనఁ
గ్రందు దేవుడు గదిసియే యుండు.

తా॥ దేవుఁడన్ని చోట్ల నన్ని వేళల నిండయుండును.

2. మంచిపని చెడ్డపని

ధృతరాష్ట్రుడు పాండురాజు అనువారు ఇద్దరన్నదమ్ములుండిరి.వ ఆరిలో పెద్దవానికిదుర్యోధనుఁడు మొదలైన నూరుగురు కొడుకులు. చిన్నవానికి ధర్మరాజు మొదలయిన అయిదుగురు కొడుకులు కలరు. ఒకనాఁడీ పిల్ల లందరు ఊరి ముందటి తోఁటలోపలికి వెళ్లి ఆడుకొనుచుండిరి. అందుఁగొందఱు ఒక మామిడి చెట్టెక్కి పండ్లు గోయుచుండిరి. అది చూచి ధర్మరాజు తమ్ముఁడైన భీముఁడు కొంటె చేష్టలకు ఆ చెట్టు పట్టుకొని బలము కొలఁది ఊపసాగెను. అంతనది పెద్దగాలికొట్టినప్పటివలె తూలి పడఁ బోయెను. చెట్టుపై పిల్లలు అయ్యయ్యో! క్రిందబడి చత్తుమని మొత్తుకొని లబలబలాడిరి. పిమ్మట ధర్మరాజు వానిని బిలిచి భీమా! ఇట్టి పనులు చేయవచ్చునా? ఒకరి కేదేని పెట్టుట మంచి పనిగాని వారికి కష్టము తగులునట్లు చేయుట తప్పిదము చెడ్డపనియై యున్నది. ఇట్లెన్నడు చేయబోకని మందలించిన వాఁడాయెను.

ద్వి॥ ఒప్పైనపని సదా యొనరించుచుండు
తప్పైనపని కెప్డు తల పెట్టబోకు.

తా॥ మంచి పని చేయుము చెడ్డ పనిచేయరాదు.

3. కోపము కులము జెరుచును

దుర్యోధనుడు ధర్మరాజు అన్నదమ్ముల కొమాళ్ళు. దుర్యోధనుడి తండ్రి గ్రుడ్డివాడగుటచేత ధర్మరాజు తండ్రి రాజ్యమునేలెను. అందువలన రాజ్యము సమానముగాఁ బంచుకొని యేలుకొండని పెద్దలు చెప్పిరి. కాని ముక్కోపియైన దుర్యోధనుఁడు రాజ్యము మాట ఎత్తినప్పుడెల్ల తోఁక త్రొక్కిన త్రాఁచు వలె మండిపడుచు పెద్దలమాట లెక్కసేయక భూమిపంచలేదు మఱియు ధర్మరాజును చాల కష్టములు పెట్టెను. ఎన్నికష్టములైనపడి ఓపిక కలిగి ధర్మరాజుండెను. అప్పుడు ధర్మరాజును జూచి జాలిపడి తండ్రి దృతరాష్ట్రుఁడు కొడుకుతో చెప్పెను. తుదకు ధర్మరాజు మేనమామ కొడుకు కృష్ణుఁడు వచ్చి బావా! నీ కోపము వల్ల కులము చెడనున్నది. నా మాటవిని వారి సగము రాజ్యము వారికిమ్మనెనను. కాని దుర్యోధనుఁడు వినలేదు. పిమ్మట యుద్ధములో వారిని జంపి ధర్మరాజు రాజ్యమేలెను.

ద్వి॥ కోపమ్ము కూడదు కులమెల్ల జెరుచు
నోపిక కులమును నొగివృద్ధి పరచు.

తా॥ కోపము కులము జెరుచును. ఓపిక కులమును వృద్ధి చేయును.

4. కఠినమున గాని పని మృదువున నగును

ఒకనాఁడు బలరాముఁడు కృష్ణుఁడు ఆవులను మేతకై అడవికి తోలుకొని వెళ్లి పగలెల్లవానిని మేపుకొని సాయంత్రానికి బడలికతో నింటికి వచ్చిరి. తరువాత వారి తల్లియైన యశోద బిడ్డలారా! ఈనాఁడు నాకు తీరుబడిలేదు. మీ తండ్రి వచ్చులోగా ఆవులను పాలుపితుకుడని పలికెను. అప్పుడు వారు బలియుండుటచేత పాలు తీయలేమనిరి. అంతట తల్లి ఏమిరా! ప్రొద్దుపోవుచున్నది మీ తండ్రి వచ్చి ఎప్పుడు తీయుననుకొన్నారు? అవి కాగి చల్లారువరకు నడిజామగునని యెఱుఁగరా? త్వరగా లేచి పాలుతీయుడు అని కోపముతో కఠినముగా నొత్తి చెప్పెను. ఆపైని మేమా పనిని చేయలేమని మీరి తిరుగఁబడిరి. అటు వెనుక యశోద “గడుసుదనముతోఁ గాని పనులు మెత్తఁదనముతోఁగాని కానేరవు’ అని తలఁచి నాయనలారా! ఈ పని మీరు చేయకున్న నెట్లగును. మీరు మంచివారు మీరేపనినేని నిముషములోఁ జేయఁగలరు, అని పలికి వారికుల్లాసము కలిగించి ఆ పనిని నెరవేర్చు కొనెను.

ద్వి॥ గడుసుఁదనంబున గాని కార్యములు
గడు మెత్తబాటున గావింపవచ్చు.

తా॥ కఠినముతోఁగాని పనిని మృదువుగా జెప్పి చేయించు కొనవలెను.

5. క్రమమెఱిఁగి కార్యము చేయవలయును

హస్తినా పట్టణమున ద్రోణాచార్యు లను ఉపాధ్యాయులు ఒకరుండిరి. ఆయుపాధ్యాయుల వద్ద కౌరవులు, పాండవులు మఱికొందరు రాజకుమారులు చదువుచుండిరి. గురువులు, వారికందరకు పాఠము లిచ్చుచుందురు. ఒకనాఁడు శిష్యులందఱు గురువు వద్ద చేరి నమస్కరించి పాఠములు చదువనారంభించిరి. అప్పుడొక శిష్యుఁడు పుస్తకము తెఱచి అక్కడక్కడ ఒకొక్కక్క ముక్క చదువుచు పొరటలు త్రిప్పివేయుచుండెను. గురువది చూచి వానినిపిలిచి చేరువగాఁ పోవుచున్న చీమలబారు చూపి అవేమి చేయుచున్నవి? ఎట్లు చేయుచున్నవని ప్రశ్నించెను. అవి యొక చోటునుండి మఱొక చోటికి బియ్యపు నూకలు తెచ్చుచున్నవి. ఆ నూక అగువరకు క్రమముగా జేర్చుచున్నవని శిష్యుఁడుత్తరము నిచ్చెను. కాని మీరేపనినేని ఎట్లు చేయవలెనని గురువు అడిగెను. మా పాఠాలు మొదలైనవి అగువరకు క్రమము తప్పక చదువుచుండవలెనని వాఁడు బదులు చెప్పెను. అది మొదలు అందఱు అట్లు చేయుచుండిరి.

ద్వి॥ చీమగుంపుల చాలు చెలువొప్పు రేఖ
పామిన తీరున పనులలవడును.

తా॥ ఏపనిగాని క్రమముగాఁ జేవలెను

6. ఒకరి కింత బెట్టినవాడే పుణ్యాత్ముడు

పూర్వము రంతిదేవుఁడను ఒక రాజుండెను. ఆయన ఎన్నో మంచి కార్యములు చేసి బ్రాహ్మణులకు అడిగినదెల్ల ఇచ్చి, బీదలను, సాదులను కాపాడుచు గొప్పదాత అని పించుకొన్న వాడయ్యెను. ఇట్లు దాతయై తుదకు తాను బీదవాడయ్యెను. అంతట ఒకనాఁడు పగలు రెండు జాములకు ఏదో యింత ఆహారము చేసికొని తినఁబోవుచుండఁగా నొక బ్రాహ్మణుఁడు వచ్చెను. ఆయనకందు సగము ఆహారమిచ్చి మిగిలినది తినబోఁ గా నొక శూద్రుడు వచ్చి అన్నము పెట్టుమని వేడెను. వానికి ఆ మిగిలిన దానిలోసగమిచ్చెను. యింతలో నొక కుక్కను వెంట బెట్టుకొని ఒక ఎఱుఁకలవాఁడు వచ్చి ఆహారమిమ్మని ప్రార్థించెను. ఆ సగము వానికిచ్చి నీరునైన త్రాగుద మనుకొనుచుండగా నొక మాలవాఁడు వచ్చి అయ్యా! ఆ నీరుపోసి నా దాహము తీర్చుమని బ్రతిమాలెను. ఆ రాజట్లె పాత్రలోని నీరు వానికిఁబోసి వాని దప్పిక తీర్చెను. అప్పుడు దేవుఁడు ప్రత్యక్షమై రాజా! నిన్ను బ్రాహ్మణాది రూపములతో బరీక్షించినది నేనేనని చెప్పి పుణ్యమిచ్చెను.

ద్వి॥ తానీయఁగల తిండి తగనిడువాఁడు
పూనికతోఁజూడ బుణ్యాత్ముఁడిలను.

తా॥ తనకున్న దానిలో ఒకరికింత బెట్టినవాఁడే బుణ్యాత్ముడు.

7. పితృ సేవ మానరాదు

కౌశికుఁడను బ్రాహ్మణుఁడు ఇంటి వద్ద తల్లిదండ్రులకుఁ జెప్పకుండ అడవికిబోయి తపస్సు జేయుచుండెను. అట్లు చేయుచుండఁగా వానిపైనొక కొంగరెట్ట వేసెను. అంత వానికి కోపము వచ్చి దానిని తేరిచూడఁ నదిచచ్చెను. ఇంతలో రెండు జాములు కాగానే చేరువనున్న పల్లెటూరిలో నొక యింటికివాఁడు భిక్షమునకు వెళ్ళెను. అప్పుడా యింట గల పతివ్రత వచ్చి నీవు పాపివి నిన్ను చూడరాదు. నీవు మిథిలాపురము వెళ్ళి ధర్మవ్యాధుఁడను కటిక వాని యొద్ద కడుశ్రద్ధతో జ్ఞానము సంపాదించుకొమ్ము. పొమ్మనెనను. బ్రాహ్మణుఁడు మిథిలాపురము బోయి కటికవానిని జూడఁగానే వాఁడు పతివ్రత బంపగా జ్ఞానమును సంపాదింప వచ్చినావుగదా? అని అనెనను. అది నీకెట్లు తెలియునని కౌశికుఁడడిగెను. పిమ్మటి కటికవాఁడు తయ యింటిలోపలి కతనిని తీసికొని వెళ్ళి ముసలివాండ్రయి తూగుటుయ్యెలలో నూగుచుండు తల్లిదండ్రుల జూపి "వీరే నా దైవములు" వీరిని ప్రతిదినము పూజింతును. వీరికన్ని విధముల సౌఖ్యము గలిగింతును. వీరి సంతోషమే నా సంతోషము. వీరి సేవచే నాకీ జ్ఞానము గలిగినది. అని చెప్పి నీవు దుర్మార్గుడవు నీ తల్లిదండ్రులు నీకై వాపోవుచున్నారు. కాన త్వరగా వెళ్లి వారిని సంతోషపెట్టుమనెను. మఱియు గురువునిట్లె పూజింపవలెననుచు వాని నింటికి పంపెను. పిమ్మటవాడుఁ తల్లిదండ్రుల ఉపాధ్యాయుల గొల్చి పుణ్యాత్ముడయ్యెను.

ద్వి. జననిని జనకు నాచార్యుని వెదకి
దినము మ్రొక్కుము, వారు దేవతల్ సుమ్మి

తా॥ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మ్రొక్క వలెను.

8. తమ తావు వదలిన తనవారు పగవారు అగుదురు.

ఒక కొలను (పెద్ద చెరువు)లో, తామరలు కలువలు రకరకములుగా నుండెను. సూర్యుడు ఉదయించువేళకు ఆ తామరలు విచ్చుచుండును. కలువలు ముడుచుకొనుచుండును. అట్లే సాయంత్రికి చంద్రుడు రాగానే తామరలు ముడుచుకొనుచుండును. కలువలు విచ్చుకొనుచుండును. ఇట్లుండ ఒకనాడు ఒక మదపుటేనుఁగు కొలనులో బడి తామరపూవులను ఆకులను త్రెంచి ఒడలుపై వేసికొనుచు కొలనంతలో నీరు కదల చేసెను. అప్పుడాయేనుఁగు త్రెంచివేసిన తామరలు ఒడ్డునబడినవి. అవి తన తావులను వదలినవి. కనుకవానికి చెలికాఁడైన సూర్యుని కిరణములే వానికి విరోధములయి యెండిపోయినవి. కనుక ఇట్లే తమ నెలవులు విడిచిన తమవారే పగవారగుదురు.

ద్వి॥ తమతమ నెలవులు దప్పిన తమకుఁ
దమవారె పగవారు తలఁచి చూడంగ.

తా॥ తమ యున్న చోటు వదలిన దమవారు పగవారగుదురు.

9. ధర్మము కాపాడుననుమాట మరువరాదు

ధర్మరాజు ధర్మము పలుకువాఁడు అది తన్ను గాచునను మాట మరువనివాడు అగును. ఒకప్పుడాయన గొప్ప యజ్ఞముఁ జేసి బ్రాహ్మణులకు అన్నదానము చేయుచుండెను. అప్పుడు వారు భుజించినచోటు బాగు చేయుటకు పురుషమృగమును తోడుకొనిరా తమ్ముడైన భీముని బంపెను. దానికై భీముడు పోవుచుండగా దారిలో హనుమంతుఁడు కనిపించి దానిఁదెచ్చుట కష్టమని తన వెంట్రుకలు గుప్పెఁడిచ్చి వీనిని ద్రోవపొడుగున బెట్టుకొనుచు వచ్చిన అది నిన్నేమియు చేయలేదని పంపెను. అంతట భీముండన్న చెప్పినట్లు వానిని దీసికొని పోయి మృగమును బిలిచి దారిలో అక్కడక్కడ వానిని ఉంచుచు వచ్చెను. అంత నా వెంట్రుకలొక్కొక్కటి ఒక్కొక్క లింగము కాగా మృగము వానిని పూజింపుచు వచ్చి వాకిలి నడుమ భీముని బట్టుకొని ఇతఁ డెవరివాడో చెప్పుమని ధర్మరాజును అడిగెను. పిమ్మట ధర్మరాజు వీఁడు వాకిలినడుమనుండఁగా నీవుపట్టితివి కావున వీనిని చీల్చి సగమును భవింపవచ్చును. వీఁడు మన ఇద్దరి సొత్తయి యున్నాడనెను. ఆ మాటలకది మెచ్చి వానిని వదలి రాజకార్యము తీర్చి నీ ధర్మము నిన్ను కాచునని వెళ్ళెను.

ద్వి|| ధర్మమెయ్యెడనైనఁ దనుగాచుననెడి
నిర్మల వాక్యంబు నెఱనమ్మవలయు.

తా|| ధర్మము తన్ను కాపాడుననుమాట మరువకూడదు.

10. పాపాత్మునకు ఒడలంత విషముండును

ఒకప్పుడు కీచకుఁడను రాజు మత్స్య దేశము నేలుచుండెను. వాఁడు మిక్కిలి క్రూరుఁడు. వాఁడు ఒకరి సొత్తును ఒకరి పెండ్లమును కోరువాడు. ఇట్లుండుచు వాఁడొకనాఁడు అక్కయగు సుధేష్ణను జూడఁబోయి అందు "మాలిని" అను దాసీని చూచెను. చూచి తన్ను పెండ్లి చేసుకొమ్మని వాఁడు ఆ బిడ్డను కోరెను. కాని ఆ పనికత్తె వాని విషపు చూపులు విషపు మాటలు విషపు చేష్టలు చూచి ఇట్లు పలికెను. ఓయీ! పామునకు పంటియందు, తేలునకు కొండియందు మాత్రమే విషముండును. నీవన్నచో పాపాత్ముఁడవు కాన నీకు ఒడలంతయు విషమయమైయుండును. నీతో మాటలాడరాదు ఇంతలో నీ వర్తమానము నా భర్తలగు గంధర్వులు విన్న నిన్ను చంపి వేతురు అని వెళ్లెను. తుదకువాఁడా పాపపు బుద్ధిచేతనే ఆమె భర్తల చేత జచ్చెను.

ద్వి|| పలు గొండ్లనె విషయంబు ఫణికిఁ దేలునకు
ఖలునకు నిలువెల్లఁ గదరావిషంబు.

తా|| పామునకు పంటియందు తేలునకు కొండియందు పాపాత్మునకు ఒడలంత విషముండును.

11. ప్రియ సత్యము

ఒకప్పుడు బలిచక్రవర్తి మూడు లోకములేలుచుండెను. అతఁడు విష్ణువునకుఁ బ్రియభక్తుండు కాన వానినెదురించి గెలుపుఁగొని స్వర్గము ఇంద్రునకు ఇచ్చుటకు ఆయనకు వీలు కాలేదు. అప్పుడు విష్ణువు వామన (పొట్టి) రూపముఁదాల్చి బలిని మూఁడడుగులు భూమిదానమిమ్మని కోరెను. బలిదూరమాలోచింపక ఇచ్చెదనని ఒప్పుకొనియెను. ఆసమయమున బలియొక్క గురువు వచ్చి ఓయీ! ఇతఁడు నిజమైన బ్రాహ్మణ బాలకుఁడు కాఁడు. నిన్నెదురింపవీలుకాక విష్ణు వీరూపముతో వచ్చెను. నీకు గవ్వకూడ లేకుండలాగుకొనఁజూచుచున్నాఁడు. కాననీకు దానమిచ్చెదనని నేననలేదని చెప్పుము. తన ప్రాణమాన రక్షణములకుగాను ఒక అబద్ధ మాడినను దోషములేదు. ఈ యబద్ధము నీకు బ్రియమిచ్చునని ఒత్తి చెప్పెను. ఆ మాటలు బలి చక్రవర్తి విని తనకుగాని ఒకరికిగాని ప్రియముగా నుండినను అతస్యము పలుకరాదు. అందఱకుఁ బ్రియమైన సత్యమునే పలుకవలెననెను. పిమ్మట తన మాటమీరెనని గురువు ఆయనను తిట్టెను. అట్లు తిట్లుపడియు వామనునకు దానమిచ్చి బలి తన ప్రియసత్యము జెల్లించుకొనెను.

ద్వి|| ప్రియమైన సత్యంబె ప్రీతితోఁబలుకుఁ
బ్రియ మసత్యముబల్క రీతిగాదెపుడు.

తా|| ఒకరికి ప్రియముగా ఉండినను అసత్యమును పలుకరాదు. అందఱకుఁ బ్రియమైన సత్యమునే పలుకవలెను.

12. పలువురతోఁ బగ పనికిరాదు

పాండవులలో మధ్యవాఁడైన అర్జునునకు అభిమన్యు డను కొడుకొకడుండెను. అతఁడు మిక్కిలి బలమును ధైర్యమును గలవాఁడు. ఆయన తండ్రి దగ్గరలేనందున ఒకనాఁడా యనయే యుద్ధములో శత్రువులతో బోరవలసివచ్చెను. అప్పుడు ద్రోణాచార్యులు బన్ను పద్మవ్యూహము (తామర మొగ్గరము) నంజొచ్చి బలములఁ జించి చెండాడుచుండెను. కాని ఆ మొగ్గరము చొచ్చుటయే తప్ప వచ్చుట అతఁడెఱుగడు. అయినను బలముగలవాఁడను నాకెదు రెవరున్నారని అతి ధైర్యముతో యుద్ధము చేయుచుండెను. ఆ యుద్ధములో వానిచేతఁ జిక్కి దెబ్బతిననివాఁడు ఒక్కఁడైనలేఁడు. ఇట్లు పోరుచుండగాఁ బగవారందఱు ఒక్క పెట్టున వానిపైఁబడి కొద్ది చీమలన్నీ చుట్టుకొని గొప్పపామును జంపినట్లు చంపిరి. బలవంతుఁడైనను పలువురతోఁ బగపనికిరాదని వాని వారంద అనుకొనిరి.

ద్వి. బలవంతుఁడును జెడు బలువురి పగను
జలి చీమలకుఁ జిక్కు సర్పంబుపగిది.

తా|| ఎంత బలముగల పామైన పెక్కు చీమలచేతఁ జచ్చినట్లు ఎంతబలవంతుఁడైనను పలువురి పగతోఁ గూలును.

13. దేవుఁడన్నిఁటిని జూచును

దుష్యంతుడను రాజు వేఁటకు వెళ్ళి అక్కడముని పల్లెలో శకుంతల యను ఒక కన్యకను రహస్యముగఁ బెండ్లి యాడెను. ఆనాఁడామెతోఁ గలసియుండి వెనుక నుంచి సేవలకుఁబంపి నిన్నుఁ బిలిపించుకొందునని చెప్పి వెళ్లెను. పిదప ఆ చిన్నదానికి ఒక పిల్లవాఁడు పుట్టెను. వాని పేరు భరతుఁడు. ఎన్నాళ్ళకు పెనిమిటి కబురంపకపోగా నామెయే పిల్లవాని తీసికొని వెళ్లెను. ఇట్లు హస్థినాపట్టణములో నుండు దుష్యంతుని వద్దకు పోయి సభలో పెనిమిటినిజూచి స్వామీ! ఈ కుఱ్ఱవాఁడు మీ కొమారుడు? నేను మీ భార్యను. ఆనాడు వనములో నన్ను మీరు పెండ్లాడినారు. కాన మమ్ముల నేలవలయునని తిన్నఁగ విన్నవించెను. ఆ మాటలు విని రాజు వనములోనుండిన నిన్ను, పట్టణములోనుండి నేను పెండ్లి చేసి కొనుట యెట్లు తటస్థించును. చాలు నీ సంగతి తెలిసినది వెళ్లు మనెను. అప్పుడు శకుంతల దైవమా! ఈ రాజు నాతోఁ గలయుట యెవరు యెఱుఁగరనుకొండు. తమరు యెఱుఁ గరా? నా వాక్యములు అబద్ధములా? నీవయిన పలుకుమని వేడుకొనెను. అంతట దైవము దుష్యంతా! ఈ చిన్నవాఁడు నీ పిల్లవాఁడు, ఈమె నీ భార్య, కావున వీరిని కాపాడుము. నీవు ఈమెను పెండ్లియాడినది నిజము అని ఆకాశము నుండి పల్కెను. ఆ వాక్యములు విని రాజట్లే వారి నేలెను.

ద్వి॥ భయముతో నడువుము భగవంతునమ్మి
నయముగా నతఁడన్ని నవిఁజూచుచుండు.

తా॥ దేవుడన్నీ చూచుచుండును. కాన నేది చేసినను యెవరును చూడరననరాదు.

14 త్రికరణశుద్ధితో నడువుము

రుక్మాంగదుఁడను రాజు ఏకాదశీ వ్రతముఁ జేయఁదలంచెను. ఇట్లు తలఁచి దానిని ప్రజలకందఱకుఁ దెలియుఎనట్లుగాఁ జాటించి, తాను జేయుచు వారిచేఁ జేయించుచుండెను. అందు వలన అందఱు పుణ్యులై స్వర్గమునకు బోఁగా, నరకమునకేగువారు లేక, యమునకు పనిలేకుండెను. అప్పుడు బ్రహ్మదేవుఁడు మోహినిని పుట్టించి రాజువద్దకుఁ బంపెను. రాజామెను పెండ్లాడి యేలు చుండెను. ఒకనాఁడు రాజు వ్రతము జేయుచు ఆమెను కలిసికొనలేదు. ఆమె వ్రతమును చెఱుపవలెనని రాజు నప్పుడె కలియుటకు రమ్మనెనను. రాజు నీవే మడిగిన నది ఇవ్వనయిన ఇచ్చెదను గాని వ్రతము సొంతము కానిది రానెనను. అంతట నీ కొమారుని తలగోసి నాకిమ్మని ఆమె కోరెను. రాజట్లే ఈబోయెను. వెంటనే దేవుఁడు ప్రత్యక్షమై పిల్లవానిని చంపవద్దు నీవు త్రికరణశుద్ధి కలవాఁడవు. నీవుతలఁచినట్లు పలికి, తలచినట్లు వ్రతము చేసినావని రాజునకు మోక్షమిచ్చెను.

ద్వి॥ మనసు వాక్కును బని ♦ మహితులకొకటె
కన నీచులకు నవి ♦ కడు వేరు వేరు.

తా॥ పెద్దలు తలఁచినట్లు పలికి, పలికినట్లు చేయుదురు. నీచులకవి వేరుగానుండును.

15 కష్టపడు వానికి దారిద్ర్యములేదు

బ్రేపల్లెయను ఊరిలో నందుఁడు ఉపనందుఁడను ఇద్దరు గొల్లవాండ్రు కలరు. వారు మిక్కిలి బీదవారు. వారిలో నందుఁడెప్పుడు ఏదోయొకపని చేసికొనుచుండువాఁడు. ఉపనందుఁడు చెడు సహవాసములు చేసి పోకిరియై అక్కడక్కడ తిరుగుచుండెడివాఁడు. నందుఁడు పాఁటుపడుచుండుట చేత దినమునకు కొంత డబ్బు సంపాదించిన దిన వెచ్చము పోను కొంచెము కొంచెము నిలువచేసెను. కాని వానికి లేమి లేకుండెను. మఱియు వానిని లెక్కసేయువాఁడును కాఁడు. ఉపనందుడు పాటుపడని కారణమును బట్టి, లేమికి జడియుచు దాని వల్లనే తినుటకు కూడును కట్టుటకు బట్టయును లేక నవయవలసివచ్చెను.

ద్వి॥ లేమిని కష్టి తా ♦ లెక్కింపఁబోడు
లేమికి కష్టికి లేదు ♦ లేశంబు కాని

తా॥ కష్టపడువానికి దారిద్ర్యము లేదు; కష్టపడువాఁడు దానిని లెక్క చేయఁడు.

16 వదలకు చేసిన పని నెరవేరును

పూర్వము దేవతలు, రాక్షసులు కలిసి అమృతము (చావులేని పదార్థము) కొఱకు పాలసముద్రము తరచుచుండిరి. ఇట్లు తరువఁగాఁ దరువఁగా గొన్నాళ్ళకు దానిలో విషము పుట్టి తరచువారినే కాకుండ లోకము లన్నిఁటిని బాధపెట్టసాగెను. అప్పుడు రెండు తెగలవారు ఈ విషమువలని బాధ తొలఁగించుకొన్నచో చావులేని పదార్థము సాధించినట్లేయని మొఱపెట్టుచు పాఱిపోసాగిరి. అంతట దేవుఁడు వారికి ప్రత్యక్షమై మీరెందుకిట్లు పరుగెత్తెదరని వారిని అడిగెను. వారు ఉన్న సంగతి విన్నవించిరి. ఆ మాటలు విని దేవుఁడు మీరు విడువకుండ చేసిన పనివల్లనే ఫలమునందఁగలరు. కష్టము కలుగుచున్నదని కార్యము వదలరాదు. కష్టపడువాఁడు చెడిపోఁడు. ఫలమును కాంచి తీరును. కాన మీరు వెనుకకు తిరిగి తరచుటకు మొదలుపెట్టుఁడనెను. విషబాధ తొలగించిన అట్లె తరవగలమని వారు పలికిరి. తరువాత దేవుఁడు విషమువలని బాధ తొలఁగింపగా దేవతలు రాక్షసులు తిరిగి సముద్రమునుంచి అమృతము బడసి త్రావిరి.

ద్వి॥ విడువ కేపనిని ♦ గావించినయేని
కడకది నెరవేరు ♦ గాదె తాలిమిని.

తా॥ విడువక చేసిన పనివలన ఫలము నందవచ్చును.

17 వ్యాధి శేషముండరాదు

చంద్రునకు అశ్విని మొదలైన ఇరువది యేడుగురు భార్యలుండిరి. వారిలో రోహిణి మిక్కిలి చక్కనిది. అందువలన నతఁడామెపై ఎక్కువ ప్రేమఁజూపుచుండెను. అదిమిగిగిలిన వారికి ఇష్టములేక తండ్రియైన దక్షునకుఁ జెప్పఁగా ఆయన చంద్రుని బిలిచి ఓయీ! నీకిది తగదు, అందఱ నొక్కటిగాఁ జూచి యేలుకొమ్ము లేదేని నీవు శిక్షింపబడుదువని చెప్పి పంపెను. కాని చంద్రుఁడెప్పటట్లుగానె ఉండెను. పిమ్మట దక్షుఁడల్లుని బిలిని తన మాట వినకుండుట వలన క్షయ (దగ్గు) వ్యాధితో నుండుమని తిట్టెను. అట్లు చంద్రుఁడుమూలబడి యుండఁగానే రాత్రుల వెలుగఁజేయువారు పైరులఁబెంచువారు లేరైరి. ఆపైని దేవతలు వీని దగ్గు మాన్పుమని దక్షుని బ్రతిమాలఁగా నెలకు పదేను రోజులు దగ్గుతో తగ్గుచు పదేను రోజులు ఆరోగ్యములో పెరుగుచునుండునట్లు అతఁడు వరమిచ్చెను. పూర్తిగా వ్యాధి నివారణ కాక పదియేను దినముల కొకసారి రోగము తిరుగబెట్టి చంద్రుని ఇప్పటికి బాధించుచున్నది. అప్పులో కూడా శేషమున్న వడ్డి పెరిగి ఇట్లే బాధించును.

ద్వి॥ వ్యాధియందైనను ♦ నప్పునందైన
బాధ తప్పక మూడుఁ ♦ బరిశేషమున్న.

తా॥ వ్యాధిలోను అప్పులోను శేషమున్న బాధించును.

18 సద్విద్యఁ గొనుటకు జాతినెంచరాదు

పూర్వము ఈశ్వరుఁడు చెడ్డమతములఁ దొలఁగింపను దొడ్డమతముల వెలిగింపను శంకరుడను పేరుతోఁబుట్టెను. ఇట్లు పుట్టి తాను విద్వాంసుఁడై పిదప సన్యాసియై దేశములు తిరిగి సభలు చేసి పండితులతో వాదించి మంచి మతముల నిలుపుచుండెను. ఆచార్యులు ఒకనాఁడు మండన మిశ్రుడను రాజునుజూడఁబోయెను. ఆయన సన్యాసి మొగము చూడడు కాన గురువువచ్చినాఁడని యెఱిఁగి కోట తల్పులు మూయించెను. పిమ్మట లోపలికెట్లు వెళ్లనా? యని ఆచార్యుడాలోచించు చుండెను. అప్పుడొక గమళ్ళవాడు తన మంత్రబలముచేత తాఁటి చెట్లను దనకందునట్లు క్రిందికి రావించి కల్లు తీసికొని పాళగేచి కుండ తగిలించి చెట్లను వదలుట వారు చూచిరి. చూచి ఎటువంటి హీనుఁడయిన వానియొద్దకూడ గొప్ప విద్య ఉండుట సహజము. 'సద్విద్యగొనుటకు జాతినెంచరాదు' అని వానిని బిలచి ఆ మంత్రమునుగొని చెట్లపైగా రాజమందిరిమున జొరఁబడి తన కార్యము నెరవేరుచుకొన్న వాఁడాయెను.

ద్వి॥ సద్విద్యఁగొనుటకు ♦ జాతి చూడకుము
సద్విద్య యుండదే ♦ చండాలునందు.

తా॥ మంచి విద్య నేర్చుకొనుటకు జాతిబేధమెంచరాదు.

19 టెంకాలయలోకి నీరువచ్చినట్లే సంపద వచ్చును

నందుఁడను ఒక బీదగొల్లవానికి సంతానము లేకుండెను. ఇందులకై వాని పెండ్లము యశోద చాలా విచారపడుచుండెను. ఇట్లుండఁగాఁగొన్నాళ్ళకు దేవుని కృపవల్ల ఒక ఆడుపిల్ల పుట్టెను. ఆనాడె మధురలో దేవకీదేవికి కృష్ణుడు పుట్టెను. కృష్ణు నక్కడనె ఉంచిన కంసుఁడు చంపునని కృష్ణుని తండ్రి వసుదేవుఁడు పిల్లవానిని దెచ్చి యశోద నిద్రబోవుచుండగా ఆమె ప్రక్కలోనైచి ప్రక్కలో పిల్లను తీసికొనివెళ్ళి పెండ్లమున కిచ్చెను. ఇది యొకానొక రాత్రి జరిగినపని. కాని యెవ్వరికి తెలియదు. ఇక్కడ యశోదానందులు కృష్ణుడు తమ పిల్లఁడేనని పెంచుచుండిరి. కృష్ణుడు వచ్చినది మొదలు నందుఁడేపని మొదలిడినను అగుచుండెను. దేనివల్లనైన ఆదాయము మిక్కిలిగ వచ్చుచుండెను. పిల్లవాఁడు తండ్రి ఆవులగాయుచుండ తాను లేఁగదూఁడలగాయుచుండెను. అతఁడు పశువుల కాయుటకు మొదలుపెట్టినది మొదలు పశువులకు మేత దొరకుచు చీడలు లేక హాయిగనుండి అవి కట్టియీనుచుండెను. మఱియు నెలకు మూడు వానలు కురిసి పంటపైరులు చక్కగా ఫలించుచుండెను. అప్పుడు మందలో గొల్లలందరు నందునకు కృష్ణుడు వచ్చినవెన్క టెంకాయలోకి నీరువచ్చినట్లు సిరివచ్చి చేరుచున్నదని అనుచుండిరి. అదే మొదలు నందుఁడు సిరితోఁదులదూగుచుండెను.

ద్వి॥ సంపద టెంకాయ ♦ సలిలంబు భంగి
నింపుగవచ్చున ♦ దెప్పుడో భువిని.

తా॥ టెంకాయలోపలికి నీరువచ్చినట్లు సిరివచ్చును.

20 ఒకనిని చంపఁజూచుఁవాఁడు తానేచచ్చును

ఒకప్పుడు కంసుఁడను రాజు మధురాపట్టణము నేలుచుండెను. వానికి పెత్తండ్రి కూతురైన దేవకియను చెల్లెలొక్కతెగలదు. ఆమెను వసుదేవుఁడను వానికిచ్చి పెండ్లి చేసిరి. అంతట చెల్లెలిని అత్తింటికి పంపుటకు కంసుఁడె తోడుగా వెళ్ళుచుండెను. అప్పుడు ఆకాశవాణి కంసుడా! నీ వెంత ప్రియము సలిపినను నీచెల్లెలి ఎనిమిదవ కాన్పు నీకు గండమును గలిగించును. అది నీకు తప్పదని చెప్పెను. అది విని వాఁడామెను చంపఁబోఁగా వసుదేవుఁడు అడ్డము వచ్చి బావా! పసుపు బట్టలతో నుండుదాని నెందుకు చంపెదవు? దీనికి పుట్టిన పిల్లలందఱ నీకు జంపనిచ్చెదను. దీనిని మాత్రమీవు చంపకుమని బతిమాలెను. వాడఁడప్పుడట్లె చెల్లెలిని చంపక విడిచెను. పిమ్మట ఆమెకు బిడ్డ కలిగినపడెల్ల వసుదేవుఁడు వానికీయగా వాఁడు చంపుచుండెను. కాని ఎనిమిదవ కాన్పు అగు కృష్ణుని యశోదకడ దాచి దాని పిల్లను దెచ్చి యియ్యగా వాఁడు దానిని చంపెను. తుదకు కృష్ణుడు వ్రేపల్లెలో ఉన్నాడఁని తెలిసి వానిని చంపుట కెందఱనో బంపెను. ఐన వారందఱక్క డతనిచే జచ్చిరి. చివరకు కంసుడె పిలిపింపఁగా కృష్ణుడు వచ్చి వానిని వానివారలజంపి తలిదండ్రుల నేలెను.

ద్వి॥ హింసజేసినవాఁడే ♦ హింసదానొందుఁ
గంసునకే హింస ♦ గలిగిన కరణి

తా॥ ఒకరిని చంపజూచినవాడు తానే చచ్చును.

తృతీయ భాగము

4వ తరగతి

1. తప్పుకాచి దెప్పరాదు

పూర్వము దుర్యోధనుడు ధర్మరాజును జూదములోనోడించి రాజ్యమూడదీసికొని అడవులకు బంపెను. ధర్మరాజు రాజ్యము కోలుపోయి తమ్ములతోఁ బెండ్లాముతో అక్కడ కష్టపడుచుండెను. అప్పుడే దుర్యోధనుడు వానిరి ఎగతాలి చేయుటకు వారున్న అడవికి వెళ్ళి అక్కడ దగ్గరలో గుడ్డల యిండ్లు వేయించుకొని అందులో సేవకులు తమకు ఉపచారము చేయుచుండుగా భార్యాపుత్రులతోఁ గలసి సంతోషముగా నుండెను. ఇంతలో నొక గంధర్వుడు వచ్చి తన యెఱుకలేకుండ తన స్థలములో దిగినాఁడని దుర్యోధను బంధించి వానివారిని బాఱఁదోలి పట్టుకొని వెళ్లెను. అంతట దుర్యోధను భార్య ధర్మరాజునొద్దకుఁబోయి కాళ్లపైబడి పతిభిక్షపెట్టి కాపాడుమని వేడెను. పిమ్మట ధర్మరాజు తన తమ్ముఁడైన అర్జును బంపగా అతఁడు వెళ్లి గంధర్వయుద్ధమున నోడించి దుర్యోధనుని విడిపించి అన్నకు అప్పగించెను. అపుడు ధర్మరాజు దుర్యోధనుని బిలిచి వెనక అతఁడు చేసిన తప్పుల దెప్పక చిన్న మెత్తు మాటయైన ననక నాయనా! ఇట్లు చేయవచ్చునా? పరస్థలముల

జాగ్రత్తగా దిరుగవలయునుగదా నీ వెఱుగనిది నే మున్నదని బుజ్జగించి పంపెను.

ద్వి॥ చెప్పెదనొకమాట ♦ చెవియొగ్గి వినుము
తప్పుగాచినమీదఁ ♦ దగదెగ్గులెన్న?

తా॥ ఒకని తప్పు మన్నించిన వెఉనుక, వానిపై నేర మెన్నరాదు

2. ఇచ్చిన దడిగిన, కోపమువచ్చును

ఒకప్పుడు రాక్షసరాజైన నరకాసురుఁడు దేవతల బాధించి ఇంద్రునిబాఱదోలి స్వర్గము నాక్రమించుకొని యేలుచుండెను. అప్పుడు ఇంద్రుడు ఏమితోచక ద్వారకకు వెళ్లి సత్యభామతో కలసియుండిన కృష్ణుని దర్శించి తన కష్టములు చెప్పుకొనఁగా శ్రీకృష్ణుల వారు చాలావిచారపడి వాని నోదార్చి తాము వచ్చి శత్రునిజంపి స్వర్గమిత్తుమని వాగ్దానము చేసిరి. పిమ్మట సత్యభామతోఁగలసి కృష్ణుఁడు నరకాసురునిపై దండెత్తి వానిని వాని వారలను జంపి స్వర్గమును సంపాదించి ఇంద్రునకియ్యగా నతఁడేలుచుండెను. మఱికొన్నాళ్లకు సత్యభామ తోఁటలో నొక పారిజాతముండిన బాగుండునని కోరగా కృష్ణుఉడు స్వర్గ పట్టణమునకు బోయి పారిజాతము స్వతంత్రించి తెచ్చుచుండగా నింద్రునకు అత్యంత కోపము వచ్చి అడ్డగించి పోట్లాటకు వచ్చెను. కాని కృష్ణుడతని నోడించి దానిని దెచ్చెను.

ద్వి॥ ఇచ్చి తెమ్మనఁగోప మెవ్వరికైన
వచ్చు నెప్పుడనునది వాలాయమరయ.

తా॥ ఒకరి కేదేని ఇచ్చి తిరిగి తెమ్మన్నఁ గోపమువచ్చును.

3. ఎన్నడు తన్నుమాలిన ధర్మము చేయరాదు

పూర్వము బలిచక్రవర్తి యను రాక్షసరాజు మూఁడు లోకము లేలుచుండెను. అతని యొద్దకు విష్ణుమూర్తి వామన (పొట్టి) రూపముతో వచ్చి నాకు మూడుఁడుఁగుల భూమిని ఇమ్మని కోరెను. అందుకు రాజు సమ్మతించి దూరమాలోచింపక ఇది యెంతలోదియని ఒప్పుకొనెను. ఇంతలో అతని గురువైన శుక్రుఁడు వచ్చి రాజా! ఇతఁడు నిజమైన వామనుఁడు కాఁడు. దేవుడు. నీ సంపద నంతయు హరించుటకు నీరూపముతో వచ్చినాఁడు. ఈ మోసము నీవెరుగవు. తన్నుమాలని ధర్మములేదు. ఇతఁడు మూఁడడుగులతో మూఁడు లోకములు ఆక్రమించును. అప్పుడు నీగతి యేమగునో ఆలోచించుకొమ్ము. అని పలుమారొత్తి చెప్పెను. కాని రాజన్నమాట తప్పవలసి వచ్చునని దానమిచ్చి లేనివాఁడయ్యెను.

ద్వి॥ తన్నుమాలిన యొక ♦ ధర్మంబు గలదె
యున్నసొమ్మంతయు ♦ నొరులఁకేడిచ్చు.

తా॥ తనకు లేకుండ ఉన్నదంత ఒకరికీరాదు.

4. గ్రహచారమునకు మారులేదు

కుండినపురము (కొండవీడు) నేలు భీమభూపాలునకు దమయంతియను ఒక కూతురుండెను. ఆమె మిక్కిలి యందగత్తె. ఆమె తండ్రి కూతురికి తగినపెనిమిటి నెక్కడగానక స్వయంవరము చాటించెను. దానికి రాజులు సురరాజులు గ్రహరాజులు కూడ వచ్చిరి. ఎందఱు వచ్చినను నిషధదేశమునేలు నలుఁడను మహారాజు నామెయే స్వయముగా వరించెను. అది చూచి శని యనుగ్రహము తనను వదలి దమయంతి యెవరినో వరించెనను పగచేత, వారియెడల తన వంకరనడక గనబచుచు వారిని రాజ్యమునుండి తొలగించి అడవుల పాలు జేసెను. శ్రీమంతులైన వారిని ఇట్లు చేయుటేగాక ఆలుమగలకు యెడబాఁటు కలుగఁజేసి రూపములు మాయజేసి వేరువేరు చోట్ల వారిని సేవకులనుగా నుంచెను. ఇంతయేల? తాను చాలని దినములలో వారికెన్నో కష్టములను పెట్టెను. తుదకు శని వదలిపోఁగా వారు తిరుగ ఒకచోటఁజేరి రాజ్యమును బడసి యేలుకొనిరి.

ద్వి॥ తీపైన చక్కెర తినునట్టినోఁట
వేపాకు తినిపించు విపరీత వేళ

తా॥ గ్రహచారము చాలని దినములలో, సుఖపడినవారే కష్టపడుదురు.

5. శరణన్న వానిని గాపాడవలెను

శిబిచక్రవర్తి యనువాఁడు చాలా యజ్ఞములుచేసి దేవతల తృప్తిపఱచెను. అప్పుడు దేవతలు వానిని పరీక్షింపగోరి ఇంద్రుం డొక డేగగాను, అగ్ని యొక పావురముగాను అయివచ్చిరి. పావురమును డేగ తరముకొని రాగా నది శిబి మరుగునఁజొచ్చి కావుమని వేడఁగా, నతఁడు రక్షింతునని వాగ్దానము జేసెను. తరువాత డేగవచ్చి రాజా! ఇది నా యాహారము నేను వీనిని కొట్టి తీసికొనివెళ్లువరకు నావరెదురు చూచుచుందురు. నాకంటె నావారికి తెచ్చిపెట్టువారెవరును లేరు. నేను చచ్చిన నావారు చత్తురు. కాన దీనిని విడువుమనెను. రాజామాటలు విని మరుగు జొచ్చినవారిని కాపాడుట నాకు ధర్మము కాబట్టి దీనిని నీకియ్యను. వేరొక పక్షిని గొట్టుకొని దినుమనెనను. అంతట డేగ రాజా! నీవీ పావురమును కాపాడఁదలఁచిన నీమాంసము దీనియెత్తు తూచి యొసంగుము. లేదేని దీనిని వదలనని పలికెను. అందులకు రాజు సమ్మతించి తన మాంసముఁగోసి తూచమొదలుపెట్టెను కాని యెంత మాంసమయిన పావురమునకు సరికాక తుదకు తాను త్రాసులోఁ గూర్చుండి తూచుకొమ్మనెనను. ఆ రాజు ధైర్యసాహసములకు దేవతలు మెచ్చుకొని నిజరూపములు చూపి వరమిచ్చిరి.

ద్వి॥ మరుగుజొచ్చినవాని ♦ మదిలోన గరుణ
నెరయఁబ్రోచుట ♦ మంచి నియమమ్ము సుమ్ము.

తా॥ మరుగుజొచ్చినవారిని కాపాడుట మంచిది.

6 చిత్తశుద్ధి

కుచేలుడను బీదబ్రాహ్మణుఁడొకడుండెను. ఆయనకు ఇరువది యేడుగురు కొమాళ్ళుగలరు. కాని ఆయనకు దొరకిన దానితో తృప్తి పొంది కుటుంబము పోషించుచుండెను. ఆయన భార్య స్వామీ! మన పేదతిక మెట్లు పోగొట్టుకొనగలమో తెలియకున్నది. పిల్లలను పోషించుట కష్టముగ నున్నది అని భర్తతో అనెను. దీనిని గురించి ఏమిచేయుదమని ఆయన పెండ్లమునడిగెను. ద్వారకలో తమచెలికాడు కృష్ణమూర్తి ఉండెఁగదా? ఆయనయొద్దకు పోరాదా? మీకేమేని ఆయన ఈయకుండునా? అని పెండ్లామనెను. అమ్మాటలు విని కుచేలుడు కృష్ణునకేమి తీసికొని వెళ్ళెదనని భార్యనడిగెను, ఈయటుకులు తీసికొని వెళ్ళమని ఆమె కొన్ని అటుకులు భర్త చినుగుల గుడ్డను కట్టెను. అవి దీసికొని కుచేలుఁడు ద్వారకకు వెళ్ళి కృష్ణుని దర్శనము చేసెను. కృష్ణుడాయనను చూచి మర్యాద చేసి కూర్చుండబెట్టి నాకేమి తెచ్చితని అడిగెను. అంత కుచేలుడు మంచి మనస్సుతో యటుకలబెట్టెను. కృష్ణుఁడవిదిని మంచిమదితో జేసిన పుణ్యము గాన కొంచెమని తలంపక కుచేలునకెన్నరాని సంపదలిచ్చెను.

ఆ.వె॥ చిత్తశుద్ధిగల్గి చేసినపుణ్యంబు
కొంచెమైననదియు కొదువగాదు
విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకునెంత
విశ్వదాభిరామ వినురవేమ

తా॥ మంచిమనస్సుతో జేసిన పుణ్యము కొంచెమైన గొప్ప ఫలమిచ్చును.

7 అల్పుఁడు సజ్జనుఁడు

ధృతరాష్ట్రునకు నూరుగురు కొడుకులుండిరి. వారిలో దుశ్శాసనుఁడు వికర్ణుఁడు అను ఇద్దరుకొడుకుల స్వభావము చూచువారికి వింతగనుండెను. ఏమన వారు ఇద్దరు ఒక్క తల్లి బిడ్డలే ఐనను దుశ్శాసనుఁడు మిక్కిలి అల్పబుద్ధిగలవాడు. ఎప్పుడు తనయొక్క అదుపుతో అణగి మణగి యుండవలయునని తాను యువరాజునని తన యధికారమునకు పిన్నలు పెద్దలు లోఁబడి యుండవలయునని తలంచుచుండువాఁడు. అట్లెగట్టిగ సాహసించు వాఁడు. మఱియు కొంచెపుపనులలో నెప్పుడు తిరుగుచుండువాఁడు. వికర్ణుడు పిన్న పెద్దలగుర్తెరిఁగి అణకువగల్గి ధర్మమున నడువలయుననియు పెద్దలయాజ్ఞ మీర రాదనియు తలంచుచు గొప్పబుద్ధితోఁదిరుగుచుండువాఁడు. వీరిని జూచువారు దుశ్శాసను గుణాలను బట్టి వాఁడల్పుఁడు అని, వికర్ణుగుణాలను బట్టి వీఁడు సజ్జనుండని యనుచుండువారు.

ఆ.వె॥ అల్పుఁడెపుడుబల్కు నాడంబరముగాను
సజ్జనుండు బల్కుచల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ

తా॥ అల్పుడు గట్టిగా మాట్లాడును. గొప్పవాడు బెట్టుగా తిరుగును.

8. బడాయి పనికిరాదు

ఉత్తరుఁడను రాజకుమారు డొకడుండెను. వాఁడు దేనికిని తానే మొనగాఁడనని డంబములు పలుకువాఁడు. ఇట్లుండ తండ్రి యింటలేనప్పుడు దుర్యోధనుఁడు సామంతులతో సైన్యముతో వచ్చి ఉత్తర భూమిలో ఆవులను ముట్టడించినాఁడని గోపాలకులు చెప్పిరి. చెప్పఁగానే నాకు తగిన సారథి లేఁడు లేకున్న నేను ఆవులను మరల్పనా? ఆడువారికడ డంబములు పలుకుచుండెను. అదివిని ఆడుపిల్లలకు విద్యనేర్పుచున్న బృహన్నల తాను రథము తోలుదునని ఒప్పుకొనెను. అంతట బృహన్నల రథమును ఆయత్తము చేసి తేగానే ఉత్తరుఁడు రాజమర్యాదలతో వెడలెను. ఇట్లు బృహన్నల ఉత్తరుఁడు ఆవుల మరల్పవెళ్లి పరసైన్యము చూచిరి. చూడగానే ఉత్తరుఁడు తొంటి బింకములుడిగి భీతితో వెనక్కు తిరిగి పాఱిపోవఁ జొచ్చెను. అప్పుడు బృహన్నల వానిని జూచి ఉత్తరుఁడా! నీడంబములు చాలు ఆడువాండ్రకడ బీరములాడు మట్టునకేనా? అని నవ్వుచు వానిని రథముతోలుమని తాను పగవారి పొగరడచి ఆవును మరల్చెను.

ఆ.వె॥ మేడిపండు మేలిమైయుండును
బొట్టవిప్పిచూడ పురుగులుండు
బెరకువానిమదిని బింకమీలాగురా
విశ్వదాభిరామ వినురవేమ

తా॥ మేడిపండువలె పైకి డంబముతో నుండినను బడాయిగల వాఁడు లోపల భీతితోనే యుండును అని తెలియవలెను.

9 సమయమునకు తగినట్లు తిరుగవలెను

పూర్వము ధర్మరాజు రాజ్యమును జూదములో గోలుపోయి పన్నెండేండ్లు అరణ్యవాసము (అడవి ఇల్లుగానుండుట) ఒక యేడు అజ్ఞాతవాసము (ఇతరులకు తెలియనిచోట ఉండుట) జరుపవలసివచ్చెను. ధర్మరాజు అరణ్యవాసము పూర్తి అయిన వెంటనే ఎవ్వరికి తెలియకుండ నెక్కడ ఉందుమా అని ఆలోచించి మన గొప్పదనములు మన మర్యాదలు ఇప్పుడు చెప్పుకొనిన కార్యముకాదని మునుపటి వేషములు భాషణములు పేరులు తలఁపక కాలానుకూలమైన వేషభాషలు పేరులు ధరించి తమ్ముల తోను భార్యతోను విరాటరాజు పట్టణమునకు బోయి ఆయనవద్ద అణఁగి మణఁగి విధేయతతో తిరిగెను. అట్లనుకూలము కాని నాళ్ళను ఎట్లో తొలఁగఁజేసి తుదకు రాజ్యము బడసెను.

ఆ.వె॥ అనువుగానిచోట నధికులమనరాదు
కొంచెముండుటెల్ల గొదువ కాదు
కొండయద్దమందు కొంచెమైయుండదా?
విశ్వదాభిరామ వినురవేమ

తా॥ అనుకూలము కానిచోట తగ్గియుండియైన పని నెగ్గించు కొనవలయును.

10 ఒకరి తప్పు లెన్న రాదు

ఒకప్పుడు ధర్మరాజు రాజసూయము అను యాగము చేయుచుండెను. అట్టి సమయములో మొదట తాంబూలము యెవరికిచ్చి పూజింపవని ధర్మరాజు సభవారినడిగెను. కృష్ణుడు దైవస్వరూపుడు ఆయనకీవలసినదని వారి తాత భీష్ముఁడు చెప్పెను. ఆ ప్రకారమే రాజు భక్తితో బూజించి కృష్ణునకు అగ్రతాంబూలము నిచ్చెను. అదిచూచి శిశుపాలుడనువాఁడు రాజా! ఈ ముసలివాని పలుకువిని మోసపోయితివిగదా? ఏమన ఈపాటి సభలో ఇతఁడు పూజ గొనదగినవాఁడు కాడు. ఈ కృష్ణుడు రాజ్యార్హతలేని యాదవుఁడు. కాన రాజుకాఁడు. మనకంటె గొప్ప కలుమైన విప్రవంశమున బుట్టినవాఁడు కాఁడు. కాన గురువు కాడు. తపస్సు చేయనందున మునికాఁడు. మీకంటె చిన్నవాడు కాన వృద్ధుకాఁడు. కాబట్టి కృష్ణుడు నేజెప్పినవారిలో ఎవరిని పూజించితివి. నీకు తెలియకున్న పుచ్చుకొనువానికి ఆతనికికూడ తెలియలేదుగా? మొన్నటిదన్క గొల్ల కొంపలలో చల్ల పాలు దొంగిలినవానికి అగ్రతాంబూలమున నేమో! అది యెట్టి మహాత్ములు పుచ్చుకొనవలెనో? ఏమి తెలియునని కృష్ణుని రాజును తప్పులెన్ని నిందలు మోపెను. అప్పుడు పెద్దలు నీవు రాజును దైవమును నిందించు నీతప్పునీవెరుగక ఒకరి తప్పు నెన్ను చుంటివాయని శిశుపాలుని గేలిచేసిరి.

ఆ.వె॥ తప్పులెన్నువారు తండోపతండంబు
లుర్విజనులకెల్ల నుండుదప్పు
తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ

తా॥ ఒకరి తప్పులెన్నువారు తమ తప్పు లెంచనేరరు.

11 పెద్దల యెడల భక్తి ఉంచు

పూర్వము హస్తినాపట్టణమును దుర్యోధనుఁడేలుచుండెను. ఆయన పెద్దలయెడ భక్తిగాని, శ్రద్ధగాని లేక చులకఁదనముతోఁ జూచుచుండువాడు. ఈయనకొక పినతండ్రికలడు. ఆయన పేరు విదురుఁడు. ఆయన పెద్దలయెడల భక్తిశ్రద్ధలు గలిగి వినయముతోఁ దిరుగుచుండువాఁడు. ఇట్లుండ ఒకనాడు దుర్యోధనుని సభకు బంధువుఁడును దైవముతో సమానుఁడును అగు కృష్ణుడు వచ్చెను. అప్పుడు రాజయిన దుర్యోధనుఁడు కృష్ణుని గొప్పగా గౌరవించక సామాన్యునివలె చూచెను. అంతట కృష్ణుఁడు అక్కడి పెద్దలతోఁగలసి మాట్లాడి వచ్చుచుండగా రాజు కృష్ణునిజూచి నీవు మా యింటికి వచ్చినప్పుడు ఇక్కడ భుజించవలసినదని కోరెను. అందుకు కృష్ణుఁడు నీకుమాయెడల శ్రద్ధాభక్తులు లేవు. భక్తిలేక చేయు పెద్దవిందున కంటె భక్తిగలిగిపెట్టు పిడికెడు మెతుకులు చాలునని పల్కి అక్కడ నిలువక విదురుని ఇంటికి వెళ్ళెను. అప్పుడు విదురుఁడు వినయముతో కృష్ణుని కెదురుగాఁ

బోయి తీసికొనివచ్చి భక్తితోఁ బూజించి భోజనము పెట్టెను. దానికే కృష్ణుడు సంతోషించి అది యొక గొప్ప విందుగాఁ దలచి విదురుని కోరికలు తీరిచిన వాఁడయ్యెను.

ఆ.వె॥ గంగిగోవుపాలు గంటెడైనను చాలు
కడివెఁడైననేమి ఖరముపాలు
భక్తిగలుగు కూడు పట్టెడైనను జాలు
విశ్వదాభిరామ వినురవేమ

తా॥ భక్తిలేకి చేయు పెద్ద విందునకంటె భక్తితో పెట్టు పిడికెడు మెతుకులు మేలు.

12. పదిమంది మాట పాటించుము

రాక్షసులు దేవతలు అని ఇరుతెగలవారుండిరి. అందు రాక్షసులు ఎక్కువ సంఖ్యగాను, దేవతలు తక్కువ సంఖ్యగాను ఉండిరి. ఇట్లుండ దేవతల రాజగు ఇంద్రుఁడొకప్పుడు స్వర్గమేలుచుండగా రాక్షసులరాజగు బలి తనవారందఱతో ఒక్క పెట్టున వచ్చి మేమును మీరును అక్కచెల్లెండ్ర బిడ్డలము అర్ధభాగస్థులము అయియున్నాము. అట్లగుటచేత మీరేలుకొనినట్లే మేమును స్వర్గమును ఏలుకోవలసియున్నది. ఇదియే న్యాయము. కాన స్వర్గము వదలుఁడు మీరు మంచితనమున వదలకున్న యుద్ధముననైన మిమ్ములగెల్చి తీసికొందుమని పలికెను. అట్లే

రాక్షసులందరు ఒక్క మాటగాఁ బలికిరి. వారందఱొకచోఁట నుండియుండి యోచనతో వచ్చినారు. కాన వారికి దేవతలోపలేక పోయిరి. మఱియు పెక్కుమంది రాక్షసుల మాటలముందర తక్కువమంది దేవతల మాటలు సాగక స్వర్గము వదలిపెట్టి వెళ్ళిరి.

ఆ.వె॥ పదుగురాడు మాట పాటియైధరఁజెల్లు
నొక్కఁడాడు మాట యెక్కదెందు
నూరకుండువాని నూరెల్లనోపదు
విశ్వదాభిరామ వినురవేమ.

తా॥ పదిమందిమాట చెల్లినట్లు ఒక్కని మాట చెల్లుబడికాదు.

13 కోపము కూడదు

దూర్వాసుఁడను ఒక మునియుండెను. ఆయన మిక్కలి కోపము గలవాఁడు. ఒక నాడాయన అంబరీషుఁడను రాజు కడకురాగా రాజు వినయముతో మునిని పూజించి ఈనాఁడు ద్వాదశికదా; పారణకు దయచేయుఁడనికోరెను. ముని యట్లేయని చెప్పి యమునానదికి స్నానమునకు వెళ్ళి అక్కడ జపము చేసికొనుచు కదలిరాకపోయెను. అప్పుడు ద్వాదశి గడియలు వెళ్ళుచున్నవి. ముని రాకుండెను. ఎట్లు అని యడుఁగగా బెద్దలు ఉదకపానముచేసి యుండవచ్చుననిరి. రాజట్లు చేసి యుండగాఁనే మునివచ్చెను. వచ్చి ముందుగ రాజు నీరుగ్రోలెనని ఆపరాని కోపముతో నొక

శక్తిని పుట్టించి రాజుపై వదిలెను. అది రాజును బాధింపఁగా రాజు విష్ణుమూర్తిని వేడుకొనెను. ఆయన తన ఆయుధమయిన చక్రముపంపెను. అదివచ్చి శక్తిని చంపి మునివెంటఁబడి బాధింపఁ జొచ్చెను. పిదప ముని దేవతలందఱ యొద్దకు వెళ్ళి చక్రమువలని బాధ తొలఁగించి కావుమనగా వారెవ్వరు మావలన కాదనిరి. వెనుక విష్ణువు దగ్గరకే వెళ్ళి నీ చక్రము బాధ మాన్పుమనగా, విష్ణువు నీ కోపము నిన్నింతచేసినది. కోపము ఘనత పోగొట్టును. దుఃఖము తెచ్చిపెట్టును. కాన కోపము నడచుకొని రాజునొద్దకు వెళ్ళు. నీ కోరిక లతఁడే తీర్చునని పల్కెను. అంతట ముని రాజుకడకు వచ్చి ఆయన వల్ల చక్రము బాధ నడచికొని వెళ్ళెను.

ఆ.వె॥ కోపనమునను ఘనత ♦ కొంచెమైపోవును
కోపమునకు మిగుల ♦ గోడుఁజెందు
కోపమడఁచెనేని ♦ కోరికలీడేరు
విశ్వదాభిరామ ♦ వినురవేమ

తా॥ కోపము వలన ఘనతపోయి దుఃఖము వచ్చును. కోపమడచినచో కోరికలీడేరును.

14 అల్పబుద్ధివాఁడు చెడును

పూర్వము నహుషుఁడను రాజు ఒకఁడుండెను. అతఁడు నూరు యజ్ఞములు చేసినవాఁడు. ఆ కాలమున నూరు యజ్ఞములు చేసినవానికి స్వర్గమునేలు ఇంద్రుని అధికారము ఇచ్చెడువారు.

అట్లే నహుషునికి ఇంద్రాధికారమిచ్చిరి. ఇట్లు ఇయ్యఁగానే అతఁడు దూరమాలోచింపక అల్ప స్వభావముతోఁ బూర్వపు ఇంద్రుని, బూర్వపు మంత్రిని వెళ్ళఁగొట్టి తానే తెలివిగల వానివలె స్వర్గమేలుచుండెను. వీఁడిట్లు అధికారము వచ్చినదని గొప్పవారిని వెళ్ళఁగొట్టునేయని దేవతలందరకు జాలకష్టముగా నుండెను. అంతటఁ గొన్నాళ్ళకు వాని కొంచెపు బుద్ధికి దగినట్లే కోరికపుట్టెను. ఏమని? పూర్వపుటింద్రుని అధికారము పొందితినిగదా! అట్లే ఆయన భార్యను కూడా పొందుదమని పూర్వమర్యాదతో మునులు మోయుచున్న మేనాతో నామె కడకు (శచీదేవి వద్దకు) వెళ్ళుచు త్రోవలో ఆ మునులచేతనె తిట్టుబడి తాను సర్పమై యుండెను.

అ.వె॥ అల్పబుద్ధివాని ♦ కధికారమిచ్చిన
దొడ్డవారి నెల్ల ♦ దొలఁగగొట్టు
చెప్పుతినెడి కుక్క ♦ చెఱకు తీపెరుగునా?
విశ్వదాభిరామ ♦ వినురవేమ

తా॥ కొందెపు బుద్ధి గలవానికి గొప్ప అధికారమునిచ్చినచోఁ బెద్దలనందఱ దొలఁగగొట్టుచుండును.

15 ఉపకారము చేయుము

శ్రీకృష్ణుడు తలిదండ్రులయిన దేవకీవసుదేవులు మొదలగు కొందఱు సాధులను కాచుటకు కంసుఁడు మొదలయిన రాజులజంపెను. అందు కంసుని మామయైన జరాసంధుడు అనువాఁడు తనయల్లుని జంపినాఁడు గదా? యని కృష్ణునిపై

బగఁబూని ఆయనకెన్నియో అపకారములు చేసి చాలా సైన్యముతో అనేక పర్యాయములు అతనిపైకి వచ్చి యుద్ధము చేసి సైన్యమును కృష్ణుని చేతిలోఁబోగొట్టికొని వెళ్లుచుండెను. అట్లె తుదకొకసారి వచ్చి యుద్ధములో సిబ్బందిపోగా దాను కృష్ణుని యన్నయైన బలరాముని చేతిలోఁ జిక్కుబడెను. అప్పుడు కృష్ణుఁడు జరాసంధుఁడు అనేక అపకారములు చేసినవాఁడు అని తలఁపక వానిని చంపవద్దని అన్నకు అడ్డముబోయి వదలించి కాపాడి ఉపకారము చేసి పంపెను.

క॥ ఉపకారికి నుపకారము
విపరీతముగాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమన్న చేయువాడు కడు నేర్పరి సుమతీ!

తా॥ అపకారముచేసిన వానికైనను ఉపకారము చేసిన వాఁడే నేర్పరి.

16 తప్పులెన్నువాని గొల్వరాదు

కాశీపట్టణమున కాలకౌశికుఁడను బ్రాహ్మణుఁడొకఁడుండెను. వానికి కలహకంఠియను భార్య కలదు. వారిద్దరు అతిక్రూరులు. దయయనునది లేశము అయినను లేక ఎప్పుడును తమ్ము పొగడుకొనుట ఒకరిని (తెగడు) నిందవేసి తప్పులెన్నుటయే పనిగాఁ గలవారు. ఇట్లుండ హరిశ్చంద్రుఁడను మహారాజు కాలవశమున తన భార్యాపుత్రుల విశ్వామిత్రుని ఋణమునకై

అమ్ముచుండఁగాఁ కాలకౌశికుడు కొనియెను. కొని పతివ్రతయైన ఆ పిల్ల తల్లిని తనకు తన భార్యకు సేవసేయ నియమించెను. ఆమెయు తెల్లవారుజామున వారికంటెను ముందులేచి చెప్పిన పనియెల్ల మాట జవదాటక చేయుచుండెను. కాని వారి స్వభావము చొప్పున ఆమె చేయు పనులలో తప్పులు ఎన్నుచు తిట్టుచు కొట్టుచు గద్దించుచు అనేక బాధలు పెట్టుచు ఉండిరి. ఇట్లెంత మెప్పుగాఁబనులు సేసినను ఆమెపై నెప్పుడు తప్పులెన్నుచునే యుండిరి. ఇట్లు తప్పు లెన్నువారిని గొల్చుట కామెకేకాక చూచు వారికిని ఎంతో కష్టముగనుండెను. తుదకాపతివ్రత సర్పము యొక్క పడగ నీడను గప్పయున్నట్లుగాఁ గాలముగడిపి తనకు మంచివానాళ్లు రాగానే సెలవుగొని వెళ్లినదాయెను.

క॥ ఎప్పుడు తప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వగూడ దదియెట్లన్నన్
సర్పంబు పడగనీడను
కప్పవసించిన విధంబు గదరా సుమతీ.

17 దుర్మార్గుని గౌరవించినను వాని గుణము మానడు

పూర్వము హైదరాబాదునేలు ఒక నబాబునకు ఒక కొమారుడుండెను. వాఁడు చిన్నతమున పిల్లలకాయలతో ఆడుకొనునప్పుడే ఎన్నెన్నియో దుడుకుపనులు చేసి చెడ్డవాఁడనిపించుకొనెనను. ఐనను రాచకొమారుడు గనుక వానినెవరు ఏమియు ననఁ

జాలకుండిరి. ఇట్లుండ వంశాచారము చొప్పున వానితండ్రివెనుక వాఁడె రాజుకావలసివచ్చెను. అప్పుడు మంత్రులు కొందరు పెద్దలుకూడి రాజ్యము యొక్క బరువు తనపై బడినవెన్కనైన చెడ్డగుణములు మానునేమోయని పూర్వాచారము ప్రకారము ఒక శుభలగ్నమందు అన్నినదులనీరు, సముద్రముల నీరు తెప్పించి రాకొమరుని ఒక బంగారు గద్దెపై గూర్చుండబెట్టి పట్టాభిషేకము జేసి రాచమర్యాదలు జరిగించి వేడుకలు సేసిరి. మఱియు అనేక రాజనీతు లుపదేశించిరి. బుద్ధులు జెప్పి మమ్ములను ప్రజలను దయతో కాపాడుమనిరి. పిమ్మట వాఁడు వారింతగాతన్ను గౌరవించినను పూర్వపు దుర్గుణములు మానక పెద్దల మాటలు మీరి దుండగపు పనులు మెండుగా జేయుచు తనయందఁ జేరినవారిన ఖండించుచు దుర్మార్గుడనిపించుకొనెను.

క॥ కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునఁ
దొనరగ బట్టముగట్టిన
వెనుకటి గుణమేలమాను వినరా సుమతీ.

తా॥ చెడ్డవానినెంత గౌరవించినను వెనుకటి గుణము మానఁ జాలఁడు.

18 నేరమి కూరిమిఁ బాపును (సుమీ)

తొల్లి ఋక్షవిరజుఁడను వానరరాజునకు వాలి సుగ్రీవులను ఇద్దరు కొమాళ్ళుండిరి. వారు ఎన్నడు జంటబాసినవారు కారు.

ఒకరినొకరు విడిచి కుడుచుటగాని ముడుచుటగాని నడచుటగాని యెఱుఁగక ఒండొరులపై ప్రేమతో దిరుగు చుండిరి. ఇట్టి కూరిమిగల దినములలో వారికి నేరములే కానరావయ్యెను. ఇట్లుండ ఒకనాటి రాత్రి వారిపైకొక రాక్షసుడు యుద్ధమునకు రాగా వానిని అన్నదమ్ములు ఇద్దరు తరిమివేసిరి. వాఁడంతట ఒక కొంగుహలో జొచ్చెను. ఇట్లు చొచ్చుగానె వాలి తమ్ముని వాకిటనుంచి తాను వానిని జంపబోయెను. ఇక్కడ సుగ్రీవుడెంత కాలమున్నను వాలి రాకపోగా సంవత్సరమైన వెన్క గుహలో రాక్షసుల కేకలు వినవచ్చెను. మఱియు గుహవాకిట నెత్తురు కాల్వగా బాఱుచుండెను. అంతట సుగ్రీవుఁడీ రెండు సంగతులు కనిపెట్టి అన్నను శత్రువు చంపియుండునని తలంచి గుహ వాకిట గొప్పరాతిని బెట్టి ఇంటికి వచ్చి తనవారికీ వార్త చెప్పి కర్మచేసి మంత్రులివ్వగా రాజ్యమేలుచుండెను. అంతట వాలి రాక్షసుజంపివచ్చి తొల్లిటి కూరిమిచెడి నేరములు తోచఁగా తమ్ముని వెళ్ళగొట్టెను.

క॥ కూరిమిగల దినములలో
నేరములెన్నడును దోచనేరవు
మరియా కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ.

తా॥ కూరిమి చెడినప్పుడన్నియు నేరములుగానే తోచు చుండును.

చతుర్థ భాగము

1 ఎటువంటివాఁడు అటువంటివానినే మెచ్చును

కొండవీఁడు నేలు భీష్మకుఁడను రాజునకు రుక్మియను కొమారుడును రుక్మిణి యను కొమార్తెయు గలరు. రుక్మిణిని ద్వారకాపురి వాసియైన శ్రీకృష్ణునకు ఇవ్వలెనని తండ్రి తలంపగా రుక్మి శిశుపాలుఁడను వాని కివ్వవలెనని పెండ్లి పనులు చేయించి వానిని పిలిపించెను. అప్పుడు పెండ్లి కొమార్తె కృష్ణునకు కబురుబంపఁగా ఆయనవచ్చి గౌరీదేవిని పూజించివచ్చెడు రుక్మిణిని తీసికొని తన రథముపై బెట్టుకొని వెళ్ళుచుండెను. ఆ సమయమున తనకు చెందకుండ పిల్లను తీసికొనిపోవు చున్నాఁడని శత్రురాజులు అందఱు కృష్ణునిపై దండెత్తిరి. అంతట వారినందఱనతఁడు చించి చెండాడెను. రాజులందరు దెబ్బలు తిని పడిపోయిరి. అప్పుడు జరాసంధుడను రాజు రుక్మి శిశుపాలులకడకు వచ్చి స్నేహితులారా! ఈ కృష్ణునిపై పదునెనిమిది సార్లు దండెత్తివచ్చి యోడిపోతిని. మీరొక్కసారికె యిట్లు చింతిల్లనేల? అతనికి మంచిదినములు వచ్చి మనల గెల్చినాడు. మనకు మంచిదినములు రాగానే అట్లే వానిని గెలువవచ్చునని తన భామమెఱిగించి క్రోధ లుబ్ధులైనవారిని ఓదార్చెను. అది గన్నవారు ఓగునోగు మెచ్చు ననుకొనిరి.

ఆ.వె॥ ఓగునోగు మెచ్చు నొనరంగన జ్ఞాని
భావమిచ్చి మెచ్చు పరములుబ్ధు
బంది బురదమెచ్చు బన్నీరు మెచ్చునా
విశ్వదాభిరామ వినురవేమ !

తా॥ ఎటువంటివాఁడటువంటివానినే మెచ్చును కాని వేరువాని మెచ్చడు.

2 సాధనములతోఁ బనులగును

అంజనికి, కేసరికి వాయుదేవుని వరమున హనుమంతుడను కుమారుఁడు కలిగెను. ఆ చిన్నవాడు సూర్యుని తనకు గురువుగా నేర్పరచుకొని విద్యలు నేర్చుకొందమని సూర్యుని వద్దకు వెళ్ళి నమస్కరించి తను వచ్చిన పని విన్నవించెను. ఆ చిన్నవాని కోరిక తెలిసి సూర్యుఁడు హనుమంతుని గుణవంతునిగాఁదలఁచి బాలకా! నేనొకచోట నుండువాడను కాను. నా వేడిమికెవరు తాళలేరు. ఇట్టి స్థితిలో నావద్ద విద్యలెట్లు చదువుదువని పలికెను. ఆ మాటలు విని హనుమంతుఁడు స్వామీఁ! నా చిన్ననాడు తెలియక మిమ్మును మ్రింగినప్పుడే తమరు నాకు వేడిమిని చూపలేదు. అట్టి సంగతిలో ఇప్పుడు వేడిమిచూపి నన్ను చెడగొట్టెదరా? అట్లెన్నడు చేయరు. ఇకను ఏ కార్యమయినా సాధనములచే నగునుగాన నా శరీరము పెంచి తమ రుదయించు చోట ఒక కాలునుంచి, అస్తమించు చోట మఱొక కాలునుంచి తమతో కలిసి తిరుగుచు విద్యల నేర్చుకొందునని పలికెను. వాని సాధనసంపదకు సూర్యుడు సంతోషించి విద్యలు నేర్పెను.

ఆ.వె॥ అనఁగననఁగ రాగ మతిశయిల్లుచుండు
తినఁతినఁగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ

3 కఠిన చిత్తుఁడు

దుర్యోధనుడు, ధర్మరాజు అన్నదమ్ముల కొమాళ్ళు. దుర్యోధనుని తండ్రి గ్రుడ్డివాఁడు కాగా ధర్మరాజు తండ్రి రాజ్యమేలెను. అందువలన తమ తండ్రి వంతు తమకిమ్మని ధర్మరాజడిగెను. దుర్యోధనుఁడు కఠినచిత్తుఁడై రాజ్యమును జూదములో గొని ధర్మరాజును అడవులపాలుచేసి అక్కడను వారి ననేక కష్టములు పెట్టెను. అరణ్యవాసము పూర్తికాగానే వారు వచ్చి సంధికి కృష్ణుని బంపగా ఆయన వాని తల్లిదండ్రుల చేత పెద్దల చేత చెప్పించి తానును, వారు నీవు పెట్టిన తిప్పలుపడి వచ్చినారు వారల రాజ్యము వారికిమ్మని చెప్పెను. ఎందఱు చెప్పినను, వాని రాతి గుండెను కరిగించలేరైరి. అది చూచిన వారందఱు కొండలు పిండియైన చేయవచ్చునుగాని దుర్యోధనుని చిత్తము కరిగింపలే మనిరి. అందువలన కఠినుడని వాని నందరు నిందించిరి.

ఆ.వె॥ పరగఱాతిగుండు పగులగొట్టఁగవచ్చు
కొండలన్ని పిండి కొట్టవచ్చు
గఠిన చిత్తుమనసు కరిగింపఁగా రాదు
విశ్వదాభిరామ వినురవేమ

4 ధార్మికుఁడు

కర్ణుఁడను రాజు అంగదేశము నేలుచుండెను. అతఁడు ఎక్కువ ధార్మికుడు. ఒకనాఁడాయన వద్దకు ఒక ఋషి (ముని) వచ్చి సేరు ఆవుపాలు నిప్పించుమని కోరెను. ఆ మాటవిని కర్ణుఁడు నవ్వి మీకు వేయి ఆవుల నిచ్చితిని తోలుకొని పొమ్మనెనను. అయ్యో! నేనీయావుల కాయఁగలనా? యని ముని యడిగెను. అట్లయిన వేయిమంది నౌకర్లను ఇచ్చితిని తీసికొమ్మని రాజు పలికెను. వీరినందఱి నెట్లు పోషింతుననఁగా వేయి అగ్రహారముల నిచ్చితిని తీసికొమ్మనెనను. ఈ యగ్రహారములపై సొమ్ము నేను వసూలుచేయఁగలనా? యని ముని యనెనను. ఐతే వేయిమంది కరణములను పంపెదను తోడుకొని వెళ్ళుమనెను. అటుతరువాత ముని రాజుయొక్క ధార్మికత్వము (ఇచ్చుటను) జూచి సంతోషించి, రాజాఁ నేను అడిగినది సేరు పాలేకదా? ఇవియన్నియు తపస్సు చేసికొనియెడు నాకెందుకని పలికెను. ఆ మాటవిని రాజు మీరు ఒకరికివ్వను ఒకరివద్ద పుచ్చుకొనను అధికారము కలవారు. కాన మీ పని తీరినతోడనే మఱియొకరి కీయవచ్చునుగదా? యని వానినిచ్చిపంపెను. ఆజనపాలు డందువల్ల చాలా పుణ్యమును గనెను. నీటిలో దిగక లోతుదెలియనిరీతిగానే కష్టజీవియైన ముని ధార్మికుఁడు కానందున పుణ్యమెట్టిదో తెలియజాలకుండెను.

ఆ.వె॥ ధార్మికునకుగాని ధర్మంబుగనరాదు
గష్టజీవికెట్లు కానబడును
నీరుచొరక లోతు నిజముగా దెలియదు
విశ్వదాభిరామ వినురవేమ

5 బీదల సాకినవాఁడె దాతయగును

ద్వారావతీ (ద్వారకా) పట్టణమును శ్రీకృష్ణుఁడేలుచుండెను. ఆయన బీదసాదుల నేలుటయందు మిక్కిలి నేర్పుకలవాఁడు. ఒకనాఁడాయనవద్దకు ఆయన స్నేహితుడయిన కుచేలుఁడను బీదబ్రాహ్మణుఁడొకఁడు చూచిపోవవచ్చెను. అతనికి చాలామంది పిల్లలు కలరు. కుచేలుఁడు వారినిం దరిని బతికించు తెలివుగానక కష్టపడుచుండెను. అప్పుడు కృష్ణుఁడు చెలికానిగోఁడు విచారింప నెంచి నిరుపేదల రక్షించువాఁడె దాతకాని, డబ్బుకలవారిని రక్షించు వాఁడొక దాతకాడని, స్నేహితుఁడు తెచ్చిపెట్టిన గుప్పెడటుకులు తిని తృప్తినిగని దానికిగానాయనకు తరుగని సంపదలిచ్చి రక్షించెను.

క॥ నిరుపేదల రక్షించెడు
సరసుఁడు నెరదాతగాక సంపన్నులఁదా
భరియించువాఁడు దాతయె
మెరమెచ్చుల దాత యతఁడు మేదిని వేమా!

తా॥ పేదలనేలువాఁడె దాతకాని, డబ్బుగలవారినేలువాఁడు నెరదాత కానేరడు.

6 మేలుమరువరాదు (సుమీ)

పూర్వము సుగ్రీవుఁడనువాఁడు శ్రీరామునితోఁ జెలిమిచేసి, అన్నను గెలిచి తన వానర రాజ్యమును తీసికొని యేలుకొను చుండెను. అప్పుడు అన్న భార్యయైన తార, కుమారుడయిన

NEETHI KATHANIDHI

Abbaraju Hanumantharayasarma Pakayaji



Publisher	:	**VELADI SATYANARAYANA**
Birth Place	:	Vijayawada (A.P.)
Date of Birth	:	04.01.1940
Profession	:	Spl. Gr. Sec. Gr. Teacher (Retd.), S.K.P.D. Boys' Hr. Sec. School, Chennai-1
Other Activities	:	1) Journalism- Eenaadu, AndhraJyothi, Web Prapancham, Rishipeetam 2) Radio Playlets, Songs Written & Directed 3) T.V. Serials` Acting & Dubbing
Settled	:	@ Chennai for the past 45 years

Other Published Books :

1. SRI ANDAL THIRUPPAVAI, 2. VELUGU BAATA SATHAKAM
3. KAMALANABHA SATHAKAM, 4. VENTAADE NEEDA
5. KAASINATHA SATHAKAMU, 6. IDI MANAKOSAM